thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 98 | జగిత్యాల | మంగళవారం | 07 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

భారత్ ఏ ఘన విజయం



11



# కేసీఆర్.. కాళేశ్వరం పాపం కడుక్కోండి



## అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి

- కాళేశ్వరంపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధం
- పేదలకు ఇళ్లెందుకు ఇవ్వలేదో చెప్పాలి
- లక్ష కోట్లు ఎలా ఖర్చు పెట్టారో చెప్పాలి
- బీఆర్ఎస్ నేతలకు పొంగులేటి సవాల్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తమ పాపం కడుక్కోవాలని ఆయన సవాల్ విసిరారు. లక్ష కోట్ల నిధులు ఎలా ఖర్చుపెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి 1 లక్ష కోట్ల నిధులు వచ్చాయి కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ప్రారంభించింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లు కాళేశ్వరం దగ్గరకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఆయన అందజేశారు.

- సిద్దిపేట, జూలై 6

2

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

2

# అటవీ భూముల్లో ఎకో టూరిజం



- పర్యాటక ప్రాంతంగా పురానాపూల్ బ్రిడ్జి
- వికారాబాద్ ఆలయానికి పాలక మండలి
- అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలు
- డిసెంబర్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్
- పెట్టుబడుల కోసం ప్రత్యేక కమిటీలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ భూముల్లో భారీగా ఎకో టూరిజం ప్రాజెక్టులను డెవలప్ చేయడంతో పాటు, పురానాపూల్ లాంటి వారసత్వ కట్టడాలను పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

# మనమెంతో మనకంత

- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కాలి
- ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ సభ
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత



బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి రోజైన ఆగస్టు 6 న హైదరాబాద్ వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బీసీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా జరిగే ఉద్యమాలకు ఈ సభ ఒక దిక్సూచిగా నిలుస్తుందని ఆమె ఉద్ఘాటించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6 న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ ఆఫీసులో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం గట్టి సంకల్పం తీసుకుంటామని తెలిపారు. "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు.

- హైదరాబాద్, జూలై 6

3



## నిజామాబాద్‌లో కిరాతకం

- బిల్డింగ్‌పై నుంచి తోసేసి.. చనిపోలేదని హార్పిక్ ఇంజెక్ట్ చేసి భర్త దారుణ హత్య!
- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి ఘాతుకం

2

## దేవుడి పేరుతో స్కామ్!

- అయోధ్య విరాళాల్లో భారీ అవినీతి..
- బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రాముడి పేరుతో రాజకీయం సరికాదు
- మండిపడిన మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 2లో..



## భగీరథ్ బెయిల్‌పై ఉత్కంఠ!

- జైల్లో ఉంటేనే పారదర్శక విచారణ
- హైకోర్టులో బాధితురాలి న్యాయవాది వాదన
- బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి
- పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

3

## 17మంది విద్యార్థులకు అస్వస్థత

- బీర్కూరు గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్

2





## బీఆర్ఎస్, కాంగ్రెస్ నాటకాలు

- కాళేశ్వరం అంశంలో డ్రామాలు
- అవినీతిపై మౌనంగా ఉన్న సీఎం
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు

3

## పివోకేలో మళ్లీ నిరసనలు



- రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు
- పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి
- భారత్ సాయం కొందరి అభ్యర్థన

4

## తాజ్ మహల్ వివాదం




- కేంద్రం, ఏఎస్ఐకు హైకోర్టు నోటీసులు
- 'తేజో మహాలయ' పిటిషన్‌పై వివరణ కోరిన అలహాబాద్ హైకోర్టు
- సర్వే, ఫొటోగ్రఫీకి అనుమతి కోరిన హిందూ పక్షం

4

## ఎంపీలకు కీలక హెచ్చరిక!

- మంత్రులు సమాధానం చెప్పే వరకు వివరాలు గోప్యంగా లోక్‌సభ సెక్రటేరియట్ ఉంచాలని ఆదేశం
- ప్రశ్నోత్తరాల సమయానికి ముందే లీక్ చేస్తే నిబంధనల ఉల్లంఘనే



4



# దేవుడి పేరుతో స్కామ్!

**అయోధ్య విరాళాల్లో భారీ అవినీతి..**

**బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**రాముడి పేరుతో రాజకీయం సరికాదు**

**మండిపడిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**సిద్దిపేట, జూలై 6::** రాముడి పేరుతో, అక్షింతల పేరుతో అయోధ్య రామమందిర నిర్మాణానికి ప్రజల నుంచి భారీగా విరాళాలు వసూలు చేసిన బీజేపీ నేతలు.. ఆ సొమ్మును దొంగిలించి దేశ ప్రజలకు తీవ్ర అవమానం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ బీజేపీ నేతలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అయోధ్య విరాళాల వ్యవహారంలో బీజేపీ దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా విరాళాలు ఇచ్చారని ఆయన తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు రాముడి పేరుతో, అక్షింతలతో విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. విరాళాల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి బీజేపీ దేవుడి పేరును వాడుకుందని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీ నేతల అవినీతిని గుర్తించే అయోధ్య ప్రజలు ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంపై మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి వెంటనే స్పందించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణానికి శంకుస్థాపన చేసింది రాజీవ్ గాంధీ అని మంత్రి గుర్తుచేశారు. రామమందిరం ట్రస్ట్ నిర్వాహకులు, బీజేపీ పెద్దలు హుండీలను కొల్లగొట్టారని ఆరోపించారు. రాముడి పేరు మీద దేశవ్యాప్తంగా వసూలు చేసిన చందాలను ఎత్తుకుపోయారన్నారు. ఊరూరా అక్షింతలు పంచి ఓట్లు అడిగిన వాళ్లు.. ఆలయంలో సొమ్ములు దొంగిలించి హిందువులందరినీ అవమానించారని మండిపడ్డారు. దేవుడి పేరు మీద బీజేపీ ఒక పెద్ద స్కామ్ చేసిందని పొన్నం విమర్శించారు. ఎంఐఎం పేరు తీయనిదే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజకీయంగా బతకలేరని పొన్నం సెటైర్ వేశారు. కిషన్ రెడ్డి గెలవాలంటే కచ్చితంగా ఎంఐఎం ను తిట్టాల్సిందేనని, అదే ఆయన రాజకీయమని విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ ఎన్యూమరేషన్ ఫారాలు చేరాలని, బీఎల్ఓ లతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. తాను స్వయంగా ఏడు మండలాలు తిరిగి పార్టీ కార్యకర్తలకు ఈ ప్రక్రియపై శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో కూడా ఓటరు సవరణ ప్రక్రియపై సమీక్ష జరిగిందని మంత్రి పొన్నం వివరించారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి**

**బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి**

**కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**హైదరాబాద్, జూలై6 :** ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ పక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ పక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ పక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై పాపాం కడుక్కోండి

**అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి**

- కాళేశ్వరంపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధం
- పేదలకు ఇళ్లెందుకు ఇవ్వలేదో చెప్పాలి
- లక్ష కోట్లు ఎలా ఖర్చు పెట్టారో చెప్పాలి
- బీఆర్ఎస్ నేతలకు పొంగులేటి సవాల్



**సిద్దిపేట, జూలై 6:** గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# అటవీ భూముల్లో ఎకో టూరిజం

- పర్యాటక ప్రాంతంగా పురానాపూల్ బ్రిడ్జి
- వికారాబాద్ ఆలయానికి పాలక మండలి
- డిసెంబర్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్
- దుర్గం చెరువుకు మరింత ఆకర్షణ
- అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలు
- పెట్టుబడుల కోసం ప్రత్యేక కమిటీలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, జూలై 6:** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ భూముల్లో భారీగా ఎకో టూరిజం ప్రాజెక్టులను డెవలప్ చేయడంతో పాటు, పురానాపూల్ లాంటి వారసత్వ కట్టడాలను పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కే రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భరత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను డెవలప్ చేయాలని సూచించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయంగా మార్చాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను అధునికీకరించాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను ముమ్మరం చేయాలని చెప్పారు. నగరంలో పురానాపూల్ వంటి వారసత్వ సంపదగా నిలిచిన బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. సుందరీకరణ తర్వాత అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రధానంగా వికారాబాద్‌లోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది.. యాదగిరిగుట్ట తరహాలో ఆ దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు సంబంధించి అధికారులను సీఎం ఆరా తీశారు. వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ పై కసరత్తును వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఈ సమ్మిట్ కోసం వివిధ శాఖల మధ్య పక్కా సమన్వయం ఉండేలా ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

# నిజామాబాద్‌లో కిరాతకం

- బిల్డింగ్‌పై నుంచి తోసేసి.. చనిపోలేదని హార్పిక్ ఇంజెక్ట్ చేసి భర్త దారుణ హత్య!
- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి ఘాతుకం
- మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడిపోయాడంటూ డ్రామా

**పోస్టుమార్టంలో గుట్టురట్టు**

**నిజామాబాద్, జూలై 6:** పరాయి వ్యకిపె పెంచుకున్న వ్యామోహంతో కట్టుకున్న భర్తనే యుడితో కలిసి అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘోర ఉదంతం నిజామాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. బిల్డింగ్‌పై నుంచి తోసేసినా భర్త చనిపోకపోవడంతో.. సిరింజ్ సహాయంతో నేరుగా నరాల్లోకి బాత్‌రూమ్ క్లీనర్ 'హార్పిక్'ను ఇంజెక్ట్ చేసి ప్రాణాలు తీసిన ఈ ఘాతుకం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ శివారు ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రశాంత్, సంధ్య దంపతులకు చాలా కాలం క్రితమే వివాహమైంది. అయితే, కొంతకాలంగా సంధ్య వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తన ప్రవర్తనను భర్త నిలదీస్తుండటంతో, తమ బంధానికి అడ్డుగా ఉన్న ప్రశాంత్‌ను శాశ్వతంగా వదిలించుకోవాలని సంధ్య తన ప్రియుడితో కలిసి పక్కా స్కెచ్ వేసింది. ప్రశాంత్‌కు ఉన్న మద్యం అలవాటును ఆసరాగా చేసుకుని, ఎవరికీ అనుమానం రాకుండా ప్రమాదంగా చిత్రీకరించేలా ప్లాన్ చేశారు. పథకం ప్రకారం ఒకరోజు ప్రశాంత్‌కు పూర్తిగా మద్యం తాగించి, మత్తులో ఉన్న అతడిని ఇద్దరూ కలిసి భవనంపైకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కిందకు తోసేయగా, తీవ్ర గాయాలైనప్పటికీ ప్రశాంత్ ప్రాణాలు పోలేదు. కొనఊపిరితో ఉన్న భర్త బతికితే తమ గుట్టు రట్టవుతుందని భావించిన సంధ్య, అంతటితో ఆగక మరో దారుణానికి ఒడిగట్టింది. ఇంట్లో ఉన్న హార్పిక్‌ను సిరింజ్ సహాయంతో ప్రశాంత్ నరాల్లోకి ఎక్కించింది. అది శరీరమంతా వ్యాపించి, అవయవాలు విఫలమవడంతో ప్రశాంత్ అక్కడికక్కడే విగతజీవిగా మారాడు. అనంతరం, మద్యం మత్తులో భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి చనిపోయాడంటూ సంధ్య అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, వీరి మధ్య ఉన్న పాత గొడవల నేపథ్యంలో ప్రశాంత్ కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించగా, శరీరంలో కెమికల్స్ చేరినట్లు నివేదిక రావడంతో అసలు గుట్టు విప్పారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సంధ్య, ఆమె ప్రియుడు తామే హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. క్షణిక సుఖాల కోసం కట్టుకున్న భర్తను ఇంత క్రూరంగా చంపిన ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# 17మంది విద్యార్థులకు అస్వస్థత

**నిజామాబాద్, జూలై 6 :** బీర్కూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం రాత్రి భోజనం వికటించి 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 12 మంది విద్యార్థులను ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. కాగా సోమవారం మరో ఐదుగురి విద్యార్థులను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. 15 మంది విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వారిని డిశ్చార్జ్ చేసినట్లు, మరో ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బీర్కూర్ మండల వైద్యాధికారిని శ్రీలేఖ తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలకు భోజనం చేయగా కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ బాన్సువాడ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.



చురకలు



# మనమెంతో.. మనకంత

- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కాలి
- ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ సభ
- జనాభా దామాషా ప్రకారం కోటా ఇవ్వాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తాం
- సభకు పిలుపునిచ్చిన కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, జూలై 6 :** బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి రోజైన ఆగస్టు 6 న హైదరాబాద్ వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బీసీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా జరిగే ఉద్యమాలకు ఈ సభ ఒక దిక్సూచిగా నిలుస్తుందని ఆమె ఉద్ఘాటించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6 న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ ఆఫీసులో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం గట్టి సంకల్పం తీసుకుంటామని తెలిపారు. "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు. ముందు భౌగోళిక తెలంగాణ సాధించుకుందాం.. ఆ తర్వాత సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం పాటు పడుదామన్న ప్రొఫెసర్ జయశంకర్ గారి సూచనల మేరకు తాము 50 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతున్నామని కవిత తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి, టీఆర్ఎస్ 2 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో పని చేస్తున్నాయని గుర్తు చేశారు. తమిళనాడులోని స్కూళ్లలో ఎంజీఆర్ ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేసే ఉద్యమాలకు హైదరాబాద్ సభ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఈ సభ దేశ గతినే మార్చేస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఆగస్టు 6 జయశంకర్ సార్ జయంతిని టీఆర్ఎస్ పార్టీ సామాజిక న్యాయ తెలంగాణ దినోత్సవంగా నిర్వహిస్తుందని కవిత తెలిపారు. తాము చేసిన ఉద్యమాలకు తలొగ్గే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా 2 వేర్వేరు బిల్లులను అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదని ఆమె విమర్శించారు. "మనమెంతో మనకంత" అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలను కలుపుకొని 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని ఆమె పిలుపునిచ్చారు.

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి


- కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు
- ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు నీరు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూలై 6:** దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ ?2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. ÷రిళిమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే పక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ నాటకాలు

- కాళేశ్వరం అంశంలో రెండు పార్టీల డ్రామాలు
- అవినీతిపై మౌనంగా ఉన్న సీఎం రేవంత్
- హైడ్రా పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత
- ఎంఐఎం నిర్మాణాలపై చర్యలు ఏవి?
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు



**హైదరాబాద్, జూలై 6 :** రాష్ట్రంలో కాళేశ్వరం, హైడ్రా అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఆడుతున్న రాజకీయ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని బీజేపీ నేత రామచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లనే కూల్చివేస్తోందని, ఎంఐఎం ఆక్రమణలపై మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొని శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనేత శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన.. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం డ్యామ్ భద్రతపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకుని భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రామచందర్ రావు, ఆ అవినీతి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై నామమాత్రపు చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు హైడ్రా చర్యలపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తున్నారని, అయితే ఎంఐఎం కు చెందిన అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫాతిమా విద్యాసంస్థల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులే కోర్టుకు తెలిపారని, హైకోర్టు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణలు జరిగినట్లు అంగీకరించినప్పటికీ అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడం వెనుక కాంగ్రెస్, ఎంఐఎం దోస్తీ కారణమని రామచందర్ రావు ఆరోపించారు. హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేసి అందరికీ ఒకే విధమైన న్యాయం చేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు ఎంఐఎం కు చెందిన అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేపడుతుందని రామచందర్ రావు హెచ్చరించారు.

# భగీరథ్ బెయిల్‌పై ఉత్కంఠ!

జైల్లో ఉంటేనే పారదర్శక విచారణ

హైకోర్టులో బాధితురాలి న్యాయవాది వాదన

భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



**హైదరాబాద్ జూలై 6 :** పోక్సో కేసులో జైలు పాలైన కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందంటూ పోలీసులతో పాటు బాధితురాలి తరపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో న్యాయస్థానం తన తీర్పును రిజర్వ్ చేసింది. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొంటూ పెట్ బషీరాబాద్ పోలీసులు కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశామని వారు తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశాక ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో అభియోగాలను సవరించినట్లు పోలీసులు కోర్టుకు వివరించారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం.. నిందితుడు స్నేహం పేరుతో పరిచయం చేసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బండి భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రి కావడంతో ఈ కేసు దర్యాప్తుపై ఆయన ప్రభావం చూపుతున్నారని బాధితురాలి తరపు న్యాయవాది వాదించారు. ఈ దర్యాప్తు దశలో నిందితుడికి బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఈ కేసులో ఇంకా పలువురు సాక్షులను విచారించాల్సి ఉందని, ఇప్పుడు బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులు తమ వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించే ప్రమాదం ఉందని న్యాయవాదులు స్పష్టం చేశారు. బండి భగీరథ్ జైల్లో ఉన్నప్పుడే కేసు విచారణ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని బాధితురాలి తరపు న్యాయవాది కుండబద్దలు కొట్టారు. ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న హైకోర్టు.. తదుపరి తీర్పును రిజర్వ్ చేసింది.

# బాలిక కిడ్నాప్ కేసులో నలుగురిపై పోక్సో కేసు

**ఖమ్మం,జూలై6:** కారేపల్లి మండల కేంద్రంలో గల ఓ ప్రభుత్వ గురుకుల కళాశాల నుండి ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముంటూ నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# గంజాయి సాగుచేసే వారిపట్ల కఠిన చర్యలు

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై6:** రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే దాడులు చేపట్టి పెద్ద ఎత్తున అరికట్టే చర్యలు చేపట్టామని అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగును చేసే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా

పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

# డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్!

**హైదరాబాద్, జూలై 6 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం అధికారికంగా అరెస్ట్ చేశారు. ఇటీవల ఆయన నివాసాలు, బంధువుల ఇళ్లపై జరిగిన దాడుల్లో భారీ ఎత్తున అక్రమ ఆస్తులు వెలుగులోకి రావడం పోలీసు వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో నమోదైన కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో ఆస్తులు బయటపడటంతో ఆయనపై ఏసీబీ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. 5 రోజుల క్రితం ఏసీబీ అధికారులు భీమ్‌రెడ్డితో పాటు ఆయన బంధువులకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ దాడుల్లో పలు విలువైన ఆస్తులు, పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం

అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

**అయోధ్య, జూలై 6:** అయోధ్య విరాళాల చోరీ ఘటన నేపథ్యంలో శ్రీ రామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించిన ట్రస్టు.. ఆయన స్థానంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి మీడియాకు వెల్లడించారు. అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 3 గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశానికి ట్రస్ట్ ఛైర్మన్ నృత్యగోపాల్ దాస్‌తో పాటు తొమ్మిది మంది శాశ్వత సభ్యుల్లో ఏడుగురు హాజరు కాగా.. చంపత్ రాయ్, మిశ్రా మాత్రం హాజరు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.



# హోటళ్లపై ఉక్కుపాదం మోపాలి..!


## ప్రజారోగ్యంతో చెలగాటం ఆడితే కఠిన శిక్షలే మార్గం

## హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉ ందన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వం-సగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొంగడం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉ ంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉ ంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించాఇ. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్ ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

# పివోకేలో మళ్లీ నిరసనలు

- రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు
- పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి
- భారత్ సాయం కొందరి అభ్యర్థన



శ్రీనగర్, జూలై 6: పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచివేసేందుకు పాక్ కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది. కాగా.. జేఏఏసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళనలకు మద్దతు ఇస్తున్న జేఏఏసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. ఈ కమిటీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీఓకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.

# తాజ్ మహల్ వివాదం

- కేంద్రం, ఏఎస్ఐకు హైకోర్టు నోటీసులు
- 'తేజో మహాలయ' పిటిషన్‌పై వివరణ కోరిన అలహాబాద్ హైకోర్టు
- సర్వే, ఫొటోగ్రఫీకి అనుమతి కోరిన హిందూ పక్షం
- కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రం, ఏఎస్ఐకి ఆదేశాలు



**ఉత్తర్‌ప్రదేశ్:** ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్ మహల్ వివాదానికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తాజ్ మహల్ ప్రాంగణంలో శివాలయం ఉందంటూ దాఖలైన 'తేజో మహాలయ' పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో నాల్గవ ప్రతివాదిగా ఉన్న పంకజ్ కుమార్ వర్మాకు సైతం కోర్టు నోటీసులు పంపింది. 'అగ్రేశ్వర్ మహాదేవ్ నాగనాథేశ్వర్ తేజో మహాలయ' ఆలయానికి సంబంధించిన అంశంపై హిందూ పక్షం కోర్టును ఆశ్రయించింది. తాజ్ మహల్ లోపల సమగ్ర సర్వే నిర్వహించేందుకు, అలాగే లోపలి భాగాలను ఫొటోగ్రఫీ చేసేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోర్టును కోరారు. అంతకుముందు ఇదే వివాదానికి సంబంధించి తాజ్ మహల్‌లో సర్వే నిర్వహించాలన్న విజ్ఞప్తిని ఆగ్రా జిల్లా కోర్టు తిరస్కరించింది. దాంతో, జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రముఖ న్యాయవాది హరి శంకర్ జైన్ అలహాబాద్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ ధర్మాసనం.. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, ఏఎస్ఐల నుంచి వివరణ కోరింది. కేంద్ర ప్రభుత్వం, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా దాఖలు చేయబోయే కౌంటర్ అఫిడవిట్ల ఆధారంగా.. తాజ్ మహల్‌లో సర్వేకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే కీలక అంశంపై అలహాబాద్ హైకోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

# ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ కీలక హెచ్చరిక!

- మంత్రులు సమాధానం చెప్పే వరకు వివరాలు గోప్యంగా ఉంచాలని ఆదేశం
- ప్రశ్నోత్తరాల సమయానికి ముందే లీక్ చేస్తే నిబంధనల ఉల్లంఘనే

**ఢిల్లీ:** పార్లమెంట్ సభ్యులకు లోక్‌సభ సెక్రటేరియట్ కీలక హెచ్చరిక జారీ చేసింది. సభలో అడిగే పార్లమెంట్ ప్రశ్నల సమాధానాల వెల్లడిపై కఠిన ఆంక్షలు విధించింది. సభలో సంబంధిత మంత్రులు అధికారికంగా సమాధానం ఇచ్చే వరకు ఆయా వివరాలను 'అత్యంత గోప్యంగా' ఉ ంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సభలో ప్రశ్నోత్తరాల సమయం ముగియకుండా ఆ సమాధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెల్లడించకూడదని స్పష్టం చేసింది. త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల (వీశీఅంశీఅ ూవంంఱశీఅ) నేపథ్యంలో ఎంపీలందరికీ ఈ నిబంధనలను గుర్తుచేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రులు ఇచ్చే లిఖితపూర్వక సమాధానాలను సభాపతి (స్పీకర్) టేబుల్‌పై ఉంచే వరకు వాటిని రహస్యంగా ఉ ంచాల్సిందేనని సెక్రటేరియట్ స్పష్టం చేసింది. సభలో మంత్రులు అధికారికంగా సమాధానం చెప్పిన తర్వాతే ఆ వివరాలను మీడియాకు లేదా ప్రజలకు తెలపాలని సూచించింది. సభలో మంత్రులు ఇచ్చే సమాధానాల తుది రూపమే పార్లమెంట్ అధికారిక రికార్డుల్లోకి వెళు ందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. సోషల్ మీడియా, మీడియా లీకలపై సీరియస్.. గత సమావేశాల సందర్భాలలో కొందరు ఎంపీలు తమ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానాలను ముందే మీడియాకు, అలాగే సోషల్ మీడియా వేదికల్లో పంచుకోవడంపై లోక్‌సభ సెక్రటేరియట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం.. లోక్‌సభలో ఉ దయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే రాజ్యసభలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ప్రశ్నోత్తరాల సమయాన్ని (ుబవర్‌అశీఅ ఎశీబతీ) కేటాయించడం జరుగుతుంది. ఈ నిర్ణీత ప్రశ్నోత్తరాల



సమయం ముగిసేలోపు ఎలాంటి సమాధానాలను బయటకు లీక్ చేసినా, అది పార్లమెంటరీ నిబంధనల ఉల్లంఘనే అవుతుందని లోక్‌సభ సెక్రటేరియట్ ఎంపీలను గట్టిగా హెచ్చరించింది.

# ఇక భారత్‌కు రప్పించడమేనా?

- నీరవ్ మోదీ అప్పగింతకు మార్గం సుగమం

**లండన్:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ పరిధిలో జరిగిన వేల కోట్ల రూపాయల భారీ రుణ మోసం, మనీలాండరింగ్ కేసుల్లో ప్రధాన నిందితుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించే ప్రక్రియకు ఉన్న అన్ని రకాల న్యాయపరమైన అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. తన అప్పగింతను సవాల్ చేస్తూ నీరవ్ మోదీ దాఖలు చేసిన ఆఖరి పిటిషన్‌ను ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో ఉన్న 'యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దీంతో ఆయనను భారత అధికారులకు అప్పగించే తుది పరిపాలనా ప్రక్రియను బ్రిటన్ ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించేందుకు పూర్తి మార్గం సుగమమైంది. భారత ప్రభుత్వం 2018 ఆగస్టులో నీరవ్ మోదీపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం, మోసం, అవినీతి, మనీలాండరింగ్, నిధుల దుర్వినియోగం, ఒప్పంద ఉల్లంఘన వంటి తీవ్రమైన అభియోగాలు నమోదు చేసింది. ఆ వెంటనే ఇంటర్‌పోల్ కూడా ఆయనపై అంతర్జాతీయ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. అయితే, నీరవ్ మోదీ తన అప్పగింతను అడ్డుకోవడానికి, ఆలస్యం చేయడానికి యూకే న్యాయవ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని లీగల్ ఆప్షన్లను ఉపయోగించుకున్నారు. బ్రిటన్ దేశీయ కోర్టుల్లో అన్ని ప్రయత్నాలూ విఫలం కావడంతో, ఆఖరి ప్రయత్నంగా 2026 ఏప్రిల్‌లో ఆయన యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయించారు. భారత్ ఇచ్చిన జైలు భద్రతా హామీలపై కోర్టు సంతృప్తి.. భారత్‌కు అప్పగిస్తే అక్కడి జైళ్లలో తనకు ప్రాణహాని లేదా అమానవీయ ప్రవర్తన ఎదురవుతుందంటూ నీరవ్ మోదీ తరపు న్యాయవాదులు వాదించారు. అయితే, ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు భద్రత, ఖైదీల పట్ల వ్యవహరించే తీరుపై భారత ప్రభుత్వం ఇచ్చిన దౌత్యపరమైన హామీలు అత్యంత సంతృప్తికరంగానే ఉన్నాయని ఇప్పటికే యూకే హైకోర్టు స్పష్టం చేసింది. డిఫెన్స్ బ్రోకర్ సంజయ్ భండారీ కేసులో మానవతా దృక్పథంతో అప్పగింతను నిరాకరించిన తీర్పును నీరవ్ మోదీ ఇక్కడ ఉ దహరించినప్పటికీ.. బ్రిటన్ కోర్టు ఆ వాదనను తోసిపుచ్చింది. 2026 మార్చిలో లండన్ హైకోర్టు (కింగ్స్ బెంచ్ డివిజన్) కూడా ఈ కేసును తిరిగి



పునఃసమీక్షించాలన్న నీరవ్ మోదీ అభ్యర్థనను కొట్టివేసింది.

## ఏ క్షణంలోనైనా భారత్‌కు నీరవ్ మోదీ!

తాజాగా ఈసీహెచ్‌ఆర్ కూడా నీరవ్ మోదీ అప్పీల్‌ను తిరస్కరించడంతో ఆయన లీగల్ పోరాటం పూర్తిగా ముగిసిందని, కేసు ఇప్పుడు ఎగ్జిక్యూటివ్ (పరిపాలనా) దశకు చేరుకుందని అంతర్జాతీయ దౌత్య వర్గాలు వెల్లడించాయి. 2019 మార్చిలో లండన్‌లో అరెస్ట్ అయినప్పటి నుంచి ప్రస్తుతం లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఖైదీగా ఉన్న నీరవ్ మోదీని భారత్‌కు తరలించేందుకు బ్రిటన్ అధికారులు పరిపాలనాపరమైన ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

# ఆషాఢ బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జూలై 16న గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో తొలి బోనం
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు




**హైదరాబాద్, జూలై 6:**

ఆషాఢ బోనాల ఉత్సవాలను తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా విజయవంతంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మ) ఆలయంలో తొలి బోనం ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం గోల్కొండ కోట ఆవరణలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తదితర అధికారులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భక్తులు, ప్రజలు, విశిష్ట అతిథులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, మొబైల్ మరుగుదొడ్లు, రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్‌లైట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ప్రత్యేక బస్సులు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను నియమించాలని, అధికారులు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమస్యలపై వెంటనే స్పందించాలని సూచించారు. సౌండ్‌ప్రూఫ్ జనరేటర్లు సిద్ధంగా ఉంచడంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు ఆదేశించారు. జూలై 16న తొలి బోనం అనంతరం ఆదివారాలు వచ్చే ప్రధాన ఉత్సవాల సందర్భంగా నాలుగు నుంచి ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- 50 కిలోల బియ్యం, నగదు సాయం అందజేత
- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు

**ఆలేరు, జూలై 6:**

ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన శివ వెంకటమ్మ కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కొల్లూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్నంది భాస్కర్ రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, ఆలేరు మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, కొల్లూరు మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి



లక్ష్మయ్య, వార్డు నాయకులు ఎం.డి. మస్తాన్, అచ్చిని బిక్షపతి, గ్యాదపాక లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు గ్యాదపాక మల్లేష్, గ్యాదపాక సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బరపటి నర్సింగ్, ఉపాధ్యక్షుడు కంద్రాజు కరుణాకర్‌తో పాటు కొల్లూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చేతి రుమాళ్లు, చాక్లెట్లు పంపిణీ

**ఆలేరు, జూలై 6(సమయం న్యూస్:**

విద్యార్థుల్లో పరిశుభ్రత అలవాట్లను పెంపొందించడంతో పాటు పుట్టినరోజును సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో టంగుటూరు గ్రామానికి చెందిన పాఠశాల శ్రేయోభిలాషి ఎలగందుల రామరుషి తన మనవడు మాన్విక్ మహర్షి పుట్టినరోజు సందర్భంగా సోమవారం వై ఆర్ ఎం జడ్పీహెచ్ఎస్, టంగుటూరు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు చేతి రుమాళ్లు



(కర్చీఫ్‌లు), చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడం రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పుట్టిన రోజులను సమా జానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవడం ఇతరులకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఎలగందుల రామరుషి గారికి పాఠశాల కుటుంబం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి ఇలాంటి సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్‌ల కార్యాలయాల ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, జూలై 6:**

తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కేటాయించిన ప్రత్యేక కార్యాలయాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో వారు మరింత విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS**

**కోస్గి మున్సిపల్,(మం) జులై,06:**

తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోస్గి పోలీసులు, నారాయణపేట సీసీఎస్ పోలీసుల సంయుక్త బృందం వేగంగా అరెస్టు చేసి, దొంగిలించిన నగదులో రూ.6,88,500 స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS తెలిపారు.జిల్లాలో ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టిన నేపథ్యంలో, కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం.54/2026, సెక్షన్ 331(3), 305 బీఎన్ఎస్ కేసును పోలీసులు శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారంతో వేగంగా ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకునీ పత్రిక సమావేశంలో నిందితుడి వివరాలు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు ఏదుల బాబు,తండ్రి చెన్నయ్య, వయస్సు 42 సంవత్సరాలు, లింగయ్యపల్లి గ్రామం, గండీడ్ మండలం, వృత్తిరీత్యా ప్రైవేట్ బస్సు




డ్రైవర్ అని తెలిపారు.సోమవారం కోస్గి లో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను గమనించిన నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా,అప్రమత్తమైన పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితుడి ఇంటి నుంచి రూ.6,88,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మొత్తం దొంగిలించబడిన నగదు రూ.10,00,000 అని తెలిపారు. నిందితుడు 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు మొత్తం 18 ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. కోస్గి, కుల్కచర్ల, మరికల్, మహమ్మదాబాద్, మద్దూర్, నారాయణపేట, వికారాబాద్, దోమా, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై పలు కేసులు నమోదయ్యాయి.ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, చెడు అలవాట్ల కారణంగా నిందితుడు పగటి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, ఇనుప పరికరాలతో తాళాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగిలించేవాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని, ఆ డబ్బుతో అప్పులు తీర్చడం, కుటుంబ ఖర్చులు నిర్వహించడం, చెడు అలవాట్లకు ఖర్చు చేసేవాడని వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS మాట్లాడుతూ... ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించిన వెంటనే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకోవడంలో విశేష కృషి చేసిన కోస్గి సీఐ ఎ. సైదులు, కోస్గి ఎస్సై జి. పురుషోత్తం, సీసీఎస్ ఎస్సై విజయభాస్కర్, కోస్గి పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీసీఎస్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.పత్రికా సమావేశంలో డిఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ లు పాల్గొన్నారు.

## జాతీయ యువ పార్లమెంట్ పోటీ విజేతలకు రేపు బహుమతుల ప్రదానం

**న్యూఢిల్లీ, జూలై 6:**

విశ్వవిద్యాలయాలు, కళాశాలల కోసం నిర్వహించిన 17వ జాతీయ యువ పార్లమెంట్ పోటీ (2024–25) బహుమతుల ప్రదానోత్సవం జూలై 7న మధ్యాహ్నం 3 గంటలకు న్యూఢిల్లీలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అధ్యక్షత వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కాశ్మీర్ విశ్వవిద్యాలయంకు ★"అటల్ బిహారీ వాజ్‌పేయి రన్నింగ్ పార్లమెంటరీ షీల్డ్"★తో పాటు ట్రోఫీ ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా కాశ్మీర్ విశ్వవిద్యాలయ విద్యార్థులు యువ పార్లమెంట్ సమావేశాన్ని మరోసారి ప్రదర్శించనున్నారు. అదేవిధంగా గ్రూపు స్థాయిలో విజేతలుగా నిలిచిన పంజాబ్‌లోని డీఏవీ కళాశాల, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం, మహారాష్ట్రలోని శివాజీ విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్, బెంగళూరులోని ఎస్ఎస్ఎంఆర్వీ కళాశాల, పాట్నాలోని చాణక్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, కురుక్షేత్ర విశ్వవిద్యాలయాలకు కూడా ట్రోఫీలు ప్రదానం చేయనున్నారు. 29 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ యువ పార్లమెంట్ పోటీల ద్వారా యువతలో ప్రజాస్వామ్య విలువలు, క్రమశిక్షణ, భిన్నాభిప్రాయాలను గౌరవించే సంస్కారం,

## శాసనసభ, శాసనమండలి విప్‌ల కార్యాలయాల ప్రారంభం



**హైదరాబాద్, జూలై 6:**

తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం శాసనసభ విప్ వేముల వీరేశం, శాసనమండలి విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ కార్యాలయాలను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అసెంబ్లీ మీడియా ఎడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన కోటగిరి-పోతంగల్ మండలాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



**కోటగిరి, జూలై 6:**



నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాత కార్యవర్గ పదవీకాలం ముగియడంతో, నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా పుల్కంటి కృష్ణ కుమార్ (V6 వెలుగు), ఉపాధ్యక్షుడిగా పుప్పల సైదయ్య (తెలంగాణ పత్రిక), ప్రధాన కార్యదర్శిగా బి. సాయిలు (ప్రభ న్యూస్), కోశాధికారిగా గాయక్వాడ్ రాము (జనం సాక్షి), సహాయ కార్యదర్శిగా పి. పెంటయ్య (ఆంధ్ర ప్రభ) ఎన్నికయ్యారు. అలాగే, ముఖ్య సలహాదారులుగా రాజు (అక్షర టుడే), బేగరి రాములు (పోరు న్యూస్) మరియు గౌరవ అధ్యక్షులుగా గోగినేని హన్మంత్ రావు (జ్ఞాన తెలంగాణ), సాయిబాబా గౌడ్ (భారతి డిజిటల్ న్యూస్)లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కాసుల శ్రీకాంత్ (నవతెలంగాణ), గంగాధర్, ఎడ్డెడి అనిల్ (ప్రజావాణి), పబ్బ నవీన్ (నమస్తే ఇందూరు వార్త), హైమద్ (ఆజ్ కా తెలంగాణ), వి. నరేష్ (సమయం), గంట్ల రాజు (మనతెలంగాణ) తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను మీడియా మిత్రులు అభినందించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్.ప్రియాంక**

**నారాయణపేట, జులై,06:**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళలతో ఘనంగా "గోరింటాకు సంబరాలు"

- కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కంపల్లి గ్రామంలో ఆషాఢం సందర్భంగా

**యాలాల మండలం, జులై,06:**



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తాండూర్ నియోజకవర్గం యాలాల్ మండలం అక్కంపల్లి గ్రామం లో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల కోసం "ఆషాఢం గోరింటాకు సంబరాలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుతున్నాం అని ఫౌండేషన్ చైర్పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ తెలిపారు.తెలంగాణ ఆడబిడ్డల ఆచారాలు,సంప్రదాయాలు,సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలందరూ ఒకే వేదికపై చేరి గోరింటాకు నూరడం, ఒకరి కొకరు గోరింటాకు పెట్టుకోవడం,సంప్రదాయ జానపద పాటలు పాడడం, ఆటలు ఆడడం,పరస్పరం ఆత్మీయంగా కలుసుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించిన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మహిళలందరూ ఎలాంటి తార,తమ్యాలు లేకుండా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి కూర్చొని ఆనందాన్ని పంచుకోవడం ఈ కార్యక్రమం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. గ్రామీణ సంస్కృతిని కాపాడుతూ మహిళల్లో ఐక్యత, ఆత్మీయత, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే ఫౌండేషన్ సంకల్పమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటేలా హాజరయ్యారని కంజర్ల విజయలక్ష్మి యాదవ్ తెలిపారు భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు

## ప్రజావాణిలో 152 దరఖాస్తులు స్వీకరణ

- ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి-
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, జులై,06:**




ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రజా ఫిర్యాదు లు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించిన 152 దరఖాస్తులను స్వీకరించారు.ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ,ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం.. మధ్యవర్తులను నమ్మొద్దు: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ఆలేరు, జూలై 6 :**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 261 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. క్లిష్ట సమయంలో అందుతున్న ఈ ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు ధైర్యాన్ని, భరోసాను కల్పిస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల పేరుతో ఎవరూ ఒక్క రూపాయి కూడా వసూలు చేయరాదని, ప్రజలు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆలేరు నియోజకవర్గంలో ప్రజల సమస్యల



పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ పాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి అర్హులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 06 :**

కుక్కలు, పిల్లలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యాకూబ్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా కుక్కలు, పిల్లలకు రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. మనుషుల నుండి జంతువులకు, జంతువుల నుండి మనుషులకు జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, రైతులు, పశుపోషకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, చనిపోయిన జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే పశు వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేబిస్ వ్యాధి 100 శాతం



నివారించ దగినదని, కుక్కలు, పిల్లలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా కుటుంబాలు, సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జంతువులు – ఆరోగ్యకరమైన మనుషులు – ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంతో అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ శాంతి రేఖ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 1–19 ఏళ్ల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి

- జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీం నగర్ జూలై6:.**

పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈనెల 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని 2,59,365 మంది పిల్లలకు 924 పాఠశాలలు, 66 జూనియర్ కళాశాలలు, 777 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూలై 13న మాత్రలు తీసుకోలేని వారికి జూలై 20న మలి విడత కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం



**ఖమ్మం, జూలై 6:.**

బాధ్యతతో ప్రజలకు అందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జూన్ నెలలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి పాల్గొని రిటైర్డ్ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 30–40 సంవత్సరాల పాటు అంకితభావంతో ప్రజాసేవ చేసిన ఉద్యోగులు అభినందనీయులని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతంగా అందించిన సేవలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చేపల ఉత్పత్తి పెరుగుదలతో మత్స్యకారులకు ఆదాయం:

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, జూలై 6:.**

ప్రభుత్వ పథకాల అమలుతో చేపల ఉత్పత్తి పెరిగి మత్స్యకారుల ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న మత్స్యకారుల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సహకార సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, చేపల ఉత్పత్తి పెంపు చర్యలను వివరించారు. అనంతరం బృందం బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఉత్పత్తి విధానం, నిర్వహణ, ఆదాయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకుంది. సమావేశంలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## జునోసిస్ వ్యాధులపై అప్రమత్తత అవసరం: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూలై 6:.**

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జునోసిస్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, స్థానిక సంస్థలు, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, ఆంథ్రాక్స్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు జునోసిస్ వ్యాధులుగా గుర్తించబడ్డాయని తెలిపారు. వ్యాధిగ్రస్త జంతువులతో సంబంధం, కలుషిత ఆహారం, జంతువుల విసర్జనలు, దోమలు, పేలు, ఈగల ద్వారా ఈ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం, వాటిని తాకిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పాలను మరిగించి, మాంసం, గుడ్లను పూర్తిగా ఉడికించి తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన జంతువులను తాకకుండా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శివానంద స్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## డీలర్లు యూరియా డిఎపి తగిన ధరలకు అమ్మాలి

వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత

**కొడంగల్ మండలం, జులై 06:**



వికారాబాద్ జిల్లా: కొడంగల్ మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించిన వ్యవసాయాధికారి ఎన్. శ్రీలత. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ,, వరి ఏడు సన్న రకాల ను అమ్మడం మరియు ఆన్లైన్ ఎంట్రీ చేయడం మరియు యూరియా డి ఏ పి అమ్మకాలు తగిన ధరలకు అమ్మాలని డీలర్లకు సూచించడం జరిగింది.

చురకలు

మంగళవారం 07 జూలై 2026

# బీద మైనార్టీ యువతి వివాహానికి బీర్ల ఫౌండేషన్ ఆర్థిక చేయూత

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేతుల మీదుగా సాయం అందజేత

**ఆలేరు, జూలై 6:**



ఆలేరు పట్టణానికి చెందిన మైనార్టీ సోదరీమణి షేక్ సుల్తాన కుమార్తె వివాహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బీర్ల అయిలయ్య బీర్ల ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వివాహం నిర్వహిస్తున్న కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత సహకారంతో వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని పేద, బలహీన వర్గాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని, అవసరమైన ప్రతి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ద్వారా సహాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్టేగోముల సాగర్ రెడ్డి, మాజీ ఆలేరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎ ఏజాస్, ఎంఎస్ విజయ్ కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు ఎండి సలీం, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నీలం వెంకటస్వామి, ఎండి జావిద్, బొంతపల్లి మధు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# ఈనెల 24లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలి.
- కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు.
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు.

**నారాయణపేట, జులై,06:**

రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 24వ తేదీలోగా శాతం వందకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి పోలింగ్ కేంద్రంలో సుమారు 1000 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ పురోగతి, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఫారాల డిజిటలైజేషన్, రాజకీయ పార్టీలతో నిర్వహించాల్సిన సంప్రదింపులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, కొత్తగా రూపొందించే పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ఈ నెల 25వ తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఈ నెల 7 వరకు పూర్తి అవుతుందని తెలిపారు.జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తూనే, తిరిగి నింపిన ఫారాలను స్వీకరించి వాటిలోని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.ఫారాల స్వీకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఈ నెల 24వ తేదీ నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సిద్ధం చేస్తామని వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్‌డీఓ రమేశ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జయ సుధ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# జాల దుర్గాప్రసాద్‌కు నియామక పత్రం అందజేత

**రాయపోల్, జూలై 6:**



రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాల దుర్గాప్రసాద్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలందరినీ కలుపుకొని రాయపోల్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య,మాజీ మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్,మాజీ ఎంపిటిసి కొత్తపల్లి స్వామి,నాయకులు పాపని ఆంజనేయులు గుంటి నర్సింహులు తదితరులు ఉన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక లాభాలు:

### కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జూలై 6:**

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నందున రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడడంతో పాటు, మొక్కల నాటకం నుంచి దిగుబడి వచ్చే వరకు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్ కంపెనీలు నాణ్యమైన మొక్కలను సకాలంలో సరఫరా చేయడంతో పాటు, రైతుల దిగుబడిని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన పేర్కొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం: ఎమ్మార్పీఎస్ నాయకులు

**కోటగిరి, జులై 6 :**

దేశ మాజీ ఉప ప్రధాని, దళిత పక్షపాతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని కోటగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సంఘమిత్ర కాలనీ వద్ద ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దినేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ప్రగతిలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ప్రధానంగా రక్షణ శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. భారతదేశం–పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి, దేశానికి విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.కులాతీత సమాజం కోసం, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప దార్శనికుడని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమసమాజ స్థాపన కోసం ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కన్నం శ్రీనివాస్, నాయకులు ఆస్గుల రవి, పేగులాలయ్య, సుధాకర్, అశోక్, అబ్బయ్య, బీఆర్ఎస్ నాయకులు నజీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 79 దరఖాస్తులు

**మంచిర్యాల, జూలై 6:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన 79 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో రేషన్ షాప్ ఏర్పాటు, ఇందిరమ్మ ఇల్లు, భూ సమస్యలు, ఉపాధి, గ్రంథాలయ ఖాళీల భర్తీ, ప్రభుత్వ పాఠశాలల సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి దరఖాస్తును పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.




**వికారాబాద్, జులై,06:**

వికారాబాద్: సోమవారము సాయంత్రం అన్ని మండలాల తహసిల్దార్లు తో జూమ్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో రేపటి నుండి వారము రోజులలో ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటైజేషన్ వంద శాతం పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందిగా చేపట్టాలని, ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకుస్తానికంగా ఉండే వాలంటీర్ల సహాయం తీసుకొని పూర్తి చేయాలనీ ఆదేశించారు.ఎన్యుమరేషన్ ఫారాలను తెసుకొని గ్యాప్స్ అన్ని పిలప్ చేయాలనీ, బి ఎల్ ఓ లు, సూపర్ వైజర్లు ఎస్ ఐ ఆర్ పై ద్రుష్టి సారించి పూర్తి చేయాలనీ ఆదేశించారు.సమావేశములో అదనపు కలెక్టర్ (రెవెన్యు) వెంకటా చారి, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర తదితరులు ఉన్నారు.

# ఆలేరు హ్యాండ్‌లూమ్ సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవం

### నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు



**ఆలేరు, జూలై 6:**

ఆలేరు హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు జరిగిన డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. మొత్తం తొమ్మిది డైరెక్టర్ పదవులకు 11 నామినేషన్లు దాఖలుకాగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే నాటికి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన తొమ్మిది మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అర లక్షి ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియలో బింగి రవి, ఎలగందుల వెంకటేశ్వర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయని ఆమె తెలిపారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు సొసైటీ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని పలువురు సభ్యులు ఆకాంక్షించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు దాసి శంకర్, అందె రాములు, యెలగందుల ఉమారుషి, గాడిపల్లి రమేష్, బింగి నర్సింలు, అంకం మల్లేశం, చింతకింది రంగ, యెలగందుల పద్మ (మహిళా కేటగిరీ), భేతి భాగ్య (మహిళా కేటగిరీ) ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లకు చేనేత కార్మికులు, సంఘ సభ్యులు అభినందనలు తెలియజేస్తూ, సొసైటీ మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# జిల్లా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ మరియు జిల్లా స్పెషన్స్ జడ్జి

**వికారాబాద్, జులై,06:**

వికారాబాద్ జిల్లా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి. లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ గారిని, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారికి ఎస్పీ పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎస్ ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం



# అవసరం: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూలై 6:.**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. ఈ నెల 24లోపు ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఓటర్లకు సహాయంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పనిచేసి ఓటర్లలో అవగాహన

# పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కు రూ.1.29 కోట్ల నికర లాభం




**మహబూబ్ నగర్, జూలై 6 :.**

పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.29 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసి లాభాల బాటలో కొనసాగుతోందని బ్యాంక్ చైర్మన్ కండె కుమారస్వామి తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1998లో స్థాపితమైన ఈ బ్యాంక్ 28 ఏళ్లలో సభ్యుల విశ్వాసాన్ని సంపాదించి అభివృద్ధి సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు రూ.55 కోట్ల రుణాలు మంజూరు చేయడంతో పాటు, రూ.60 కోట్ల డిపాజిట్లు సమీకరించామని తెలిపారు. బ్యాంక్ వాటా మూలధనం రూ.3.5 కోట్లకు పైగా ఉందని, సభ్యులకు 25 శాతం డివిడెండ్ అందజేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జోగులాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో త్వరలోనే కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహకార అధికారి కృష్ణ మాట్లాడుతూ, లాభదాయకంగా కొనసాగుతున్న పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ త్వరలో మల్టీ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి కే. టైటస్ పాల్, బ్యాంక్ సీఈఓ రాజేంద్ర కుమార్, సహకార శాఖ ఉద్యోగులు కల్పనా, దివ్య, బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ కలెక్టరేట్ మనందరి బాధ్యత: కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్, జూలై 6:**

స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మెదక్ నిర్మాణానికి అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులకు నాలుగు రంగుల డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ కార్యాలయాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి కార్యాలయంలో తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక జాగ్రత్త చెత్తను వేర్వేరుగా సేకరించేలా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి వద్దే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని, తడి చెత్తకు ఆకుపచ్చ, పొడి చెత్తకు నీలం, సానిటరీ చెత్తకు ఎరుపు, ప్రత్యేక జాగ్రత్త చెత్తకు నలుపు రంగు డస్ట్‌బిన్లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్యతో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత కోసం కృషి చేసిన వ్యక్తి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 06 :**

దేశ సమగ్రత కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ లు హాజరయ్యారు. ముందుగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ, ఒకే దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని కాశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు కోసం పోరాడారని గుర్తు చేశారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గం అశోక్, గాజుల ముఖేష్ గౌడ్, కమలాకర్ రావు, జోగుల శ్రీదేవి, కస్తూరి నాగరాజు, బోట్ల సత్యం, వైద్య శ్రీధర్, అమిరిశెట్టి రాజ్ కుమార్, ఆడే ప్రేమ్ సింగ్, పచ్చ స్వప్న రాణి, బింగి ప్రవీణ్, నాంపల్లి శ్రీనివాస్, అట్కాపురం సమ్మయ్య, గొల్ల మహేందర్, నాగుల రాజన్న, ముదాం మల్లేష్, ముల్కల్లా కుమార్, నాగుల రాజన్న, రాజమౌళి లు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ఖాతాలను SGSP ఖాతాలుగా మార్చుకోండి

- **ఉద్యోగులు తమ ఖాతాలను శాలరీ ప్యాకేజీ ఖాతాలుగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ జూలై6:**



.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో శాలరీ ఖాతా ప్రయోజనాలు కరపత్రం ను కలెక్టర్ ఆవిష్కరించారు.ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి SBI ప్రాంతీయ మేనేజర్ శ్రీ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కొత్త SGAP ఖాతాల విశేషాలను వివరించారు. SBI తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం (MOU) కుదుర్చుకుంది; దీని ప్రకారం, SBIలో జీతం ఖాతా (salary account) కలిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ. 1 కోటి ఉచిత ప్రమాద బీమా రక్షణ లభిస్తుంది. అంతేకాకుండా, ఉద్యోగి రూపే (RuPay) డెబిట్ కార్డును ఉపయోగిస్తే అదనంగా 10 లక్షల రూపాయల ఉచిత ప్రమాద బీమా కూడా లభిస్తుంది. ఉద్యోగులందరికీ 10 లక్షల గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా అందుబాటులో ఉంది. SBI atm లో ఎన్ని సార్లయ్యా ఫ్రీ గా డబ్బు డ్రా చేసుకునే అవకాశం కూడా ఉంది. నెలకు 10 సార్లు ఇతర బ్యాంక్ ATM నుండి నగదు తీసుకోవచ్చు. కనీస నిల్వకు సంబంధించిన ఛార్జీలు కూడా వర్తించవు.

ఉద్యోగులందరికీ తమ సంబంధిత ఖాతాలను 'శాలరీ ప్యాకేజీ ఖాతాలు'గా మార్చుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో శిక్షణార్థ సహాయ కలెక్టర్ సాయి శివాని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీమతి జె.ఎల్.బి. హరిప్రియ, డి.ఆర్.ఓ. శ్రీమతి నిర్మల, జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు శ్రీ రామమూర్తి, శ్రీ సత్య ప్రకాష్, శ్రీ అల్తాఫ్ హుస్సేన్ మరియు కలెక్టరేట్ కాంప్లెక్స్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

# "ఆపరేషన్ ముస్కాన్" బృందాలతో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ సమావేశం

**వికారాబాద్, జులై,06:**




జిల్లా పోలీస్ కార్యాలయంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (AHTU) మరియు "ఆపరేషన్ ముస్కాన్" బృందాలతో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, "జిల్లాలో మానవ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడంలో AHTU బృందాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే స్పందించి, అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. సమాజంలో అత్యంత నిస్సహాయులైన మహిళలు, చిన్నారుల రక్షణకు మనం అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి." అని సూచించారు.అదేవిధంగా, "వీధులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో బాల కార్మికులుగా మారుతున్న చిన్నారులను గుర్తించి, వారిని రక్షించేందుకు 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాన్ని జిల్లాలో మరింత పకడ్బందీగా అమలు చేయాలి. వివిధ కారణాల వల్ల తప్పిపోయిన లేదా అనాథలుగా మారిన చిన్నారులను గుర్తించి, వారిని సురక్షితంగా వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు చేర్చడంలో పోలీసులు, సంబంధిత శాఖలు కేవలం చట్టపరంగానే కాకుండా మానవీయ దృక్పథంతో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి." అని పేర్కొన్నారు."ఈ ఆపరేషన్‌లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి ఆశించిన ఫలితాలను సాధించాలి." అని ఎస్పీ ఆదేశించారు.ఈ ప్రత్యేక సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS, DCRB డీఎస్పీ జానయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి, మోమిన్‌పేట్, ధరూర్, కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, AHTU ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా, CWC చైర్‌పర్సన్ వెంకటేశం, సభ్యులు ప్రకాష్, DLSA సభ్యులు వెంకటేశం, DCPU ఇన్‌చార్జ్ శ్రీకాంత్, షఫీ, చైల్డ్‌లైన్ రాజు నాయక్, లీగల్ సెల్ నుంచి నరేష్ కుమార్, సఖి సెంటర్ ఇన్‌చార్జి యశోద, సాధన ఎన్జీవో ప్రతినిధులు నర్సింలు, గౌరీ, విద్యాశాఖ నుంచి శ్రీదేవి, ఆరోగ్య శాఖ నుంచి డాక్టర్ నిఖిల్ (CAS), DRDA DPM నర్సింలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భరోసా టీం మరియు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, జులై,06:**

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భరోసా టీం మరియు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లైంగిక వేధింపులు, గృహ హింస మరియు పోక్సో (POCSO) చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధితులకు భరోసా కేంద్రాల ద్వారా తక్షణ సహాయం, రక్షణ మరియు న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. బాధితులకు కేవలం చట్టపరమైన సహాయమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సిలింగ్ మరియు పునరావాసం కల్పించడంలో అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె స్పష్టం చేశారు.కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్థులకు తగిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుల్లో ధైర్యాన్ని నింపేందుకు భరోసా కేంద్రం ఒక దిక్సూచిలా పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడటమే మన ప్రాధాన్యత కావాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సమావేశంలో తెలిపినారు.ఈ ప్రత్యేక సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS, DCRB డీఎస్పీ జానయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి,




మోమిన్‌పేట్, ధరూర్, కొడంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఏహెచ్‌టీయూ (AHTU) ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా, భరోసా సెంటర్ ఇంచార్జి శ్వేత, సిడబ్ల్యూసి (CWC) చైర్‌పర్సన్ వెంకటేశం, సభ్యులు ప్రకాష్, డిఎల్‌ఎస్ఎ (DLSA) సభ్యులు వెంకటేశం, డిసిపియు (DCPU) ఇంచార్జ్ శ్రీకాంత్, షఫీ, చైల్డ్ లైన్ రాజు నాయక్, లీగల్ సెల్ నుండి నరేష్ కుమార్, సఖి సెంటర్ ఇంచార్జి యశోద, సాధన ఎన్జీవో నర్సింలు, గౌరీ, ఎడ్యుకేషన్ జిసిడివో (GCDO) శ్రీదేవి, హెల్త్ డిపార్ట్‌మెంట్ నుండి డాక్టర్ నిఖిల్ (CAS), DRDA DPM నర్సింలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# భూ నిర్వాసితులకు రూ.4.5 కోట్ల నష్టపరిహార చెక్కులు పంపిణీ

**హైదరాబాద్, జూలై 6:.**

రాజీవ్ రహదారి ఎస్‌హెచ్–01 ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహార చెక్కులు పంపిణీ చేసినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు భూ నిర్వాసితులకు సుమారు రూ.4.5 కోట్ల నష్టపరిహార చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కదిరవన్ పలని, డీఆర్వో నారాయణ, ఎల్‌ఏఓ (ఎస్‌హెచ్–01) అపర్ణ, అధికారులు, సిబ్బంది, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.




# లింగ నిర్ధారణపై ఉక్కుపాదం.. పీసీ & పీఎన్‌డీటీ చట్టం కచ్చితంగా అమలు చేయాలి

**సంగారెడ్డి, జూలై 6:**

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టి, పీసీ & పీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాల పనితీరు, చట్టం అమలు, రికార్డుల నిర్వహణ, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారిడాక్టర్ లలిత దేవి మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అన్ని స్కానింగ్ కేంద్రాలు పీసీ & పీఎన్‌డీటీ చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి సమాచారం తెలిసిన వెంటనే జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. మహిళలు, బాలికల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.





# కీర్తిచక్ర పొందిన మొదటి సైనికేతరుడు వాడపల్లి

## నేడు వాడపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతి

**భారత దేశంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బహూకరించే అత్యున్నత పురస్కారాలలో 'కీర్తిచక్ర' రెండవది. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు మాత్రమే ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం అది. అయితే... ఓ సైనికేతర పౌరుడైన వాడిపల్లి వెంకటేశ్వరరావు మొట్ట మొదటి సారిగా ఆ పురస్కారాన్ని పొందడం వెనుక...ఆయన చేపట్టిన పదవీ బాధ్యతలు, అందించిన సేవలు, అన్నింటినీ మించి త్యాగనిరతి కారణాలు.**

భారతదేశంలో కీర్తిచక్ర పొందిన మొట్టమొదటి సైనికేతర పౌరుడైన వి.వి. రావు గా వాసికెక్కిన వాడపల్లి వెంకటేశ్వరరావు (ఆగష్టు 26, 1963 – జూలై 7, 2008) 1963 ఆగష్టు 26వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో వాడపల్లి అప్పలాచార్యులు, సుభద్ర దంపతులకు జన్మించారు. పుట్టిన చోటే ఎస్.ఎస్.సి. వరకు చదివిన ఆయన.. ఎ.పి.ఆర్.జె.సి. నాగార్జున సాగర్ లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు.సివిల్ సర్వీసెస్ లో టాపర్ గా నిలవడమే తన ధ్యేయమని తన సిల్వర్ జూబ్లీ కళాశాల మిత్రులతో వి.వి.రావు చెప్పడం వల్ల అందరూ వి.వి.రావును పేరుతో కాకుండా "టాపర్" అని పిలిచేవారు. వాడ్రేవు చినవీరభద్రుడు కూడా ఆయన సహాధ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండే ఆయన.. ప్రవేశ పరీక్ష రాసి, తద్వారా కర్నూలులో వుండే సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ.గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1983 నుండి 1985 సం.లో హైదరాబాదులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం నుండి ఎం.ఫిల్ పూర్తి చేశారు. తర్వాత అదే విశ్వ విద్యాలయం నుండి ఆసియా దేశాలతో భారతీయ సంబంధాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించారు.

వెంటనే 1990 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరై ఆప్షంస్ లో ఐ.పి.ఎస్./ఐ.ఎఫ్.ఎస్. లకు అవకాశం వుండగా ప్రపంచ దేశాలతో భారత సంబంధాలపై పరిశోధన ద్వారా మంచి పట్టు వుండడంతో, రిటైర్డ్ హెల్త్ ఎక్స్ టెన్షన్ అధికారి అయిన తండ్రి వాడపల్లి అప్పలాచార్యులు సూచన ద్వారా ఇండియన్ ఫారిన్ సర్వీస్ ను ఎంపిక చేసుకున్నారు.

తొలుత ఆయన జర్మనీలోని భారత రాయభార కార్యాలయంలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత శ్రీలంక, నేపాల్, భూటాన్, ఇండియా, అమెరికా వంటి దేశాలలో 1990 నుండి 2005 వరకు పనిచేశారు. ఆఫ్ఘనిస్తాన్ లోని రాయబార కార్యాలయంలో పని చేయడానికి చాలా మంది అయిష్టత వ్యక్తం చేయడంతో... ఆ స్థితిలో భారత ప్రభుత్వం ఆ పదవికి వి.వి.రావును నిర్ణయించింది. విధి నిర్వహణలో మంచి పట్టుదల, సమర్ధత కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన ఆయన.. ప్రభుత్వం తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేకించి సవాలుగా తీసుకొని అక్కడ విధులలో చేరారు.

అక్కడి కాబూల్ లోని భారత రాయబార కార్యాలయంలో కన్సులేట్ గా 3 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్ఘనిస్తాన్ లోని ముఖ్యమైన భాషలలో ఒకటైన "దారి" భాషలో చక్కటి పట్టువున్న వి.వి.రావు భారత్, ఆఫ్ఘన్ ఇరుదేశాల సంబంధాలను, మైత్రీ బంధాన్ని ఇనుమడింప జేశారు. 2008 జూలై 7వ తేదీన కాబూల్ లోని భారత రాయబార కార్యాలయం ముందు జరిగిన తీవ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మొత్తం 41 మంది మృతి చెందగా... ఆ దూరదృష్ట అవాంఛిత దుర్ఘటనలో భారత రక్షణ విభాగానికి చెందిన బ్రిగేడియర్ మెహతాతో పాటు మరో ముగ్గురు కార్యాలయ సిబ్బంది మరణించారు. అలా మరణించిన వారితో పాటుగా, భారతీయ దౌత్యవేత్త అయిన 44 యేళ్ళ వాడపల్లి వెంకటేశ్వరరావు కూడా వున్నారు. ఆ విధంగా విధి నిర్వహణలో అసువులు బాసి, అమరులైన ఆయనకు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు ఇచ్చే కీర్తిచక్ర పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ విధంగా కీర్తిచక్రతో గౌరవించబడిన మొట్టమొదటి సైనికేతర భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. వి.వి.రావు పదవికి సమానమైన హోదా కలిగిన భారతీయ సాంస్కృతిక సంస్థ, బ్యాంకాక్ కు డైరెక్టర్ గా పదవీ బాధ్యతలను ఆయన ధర్మపత్ని వాడపల్లి మాలతీరావుకు భారత ప్రభుత్వం అప్పగించి గౌరవించింది.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నిషేధానికి గురైన తొలి తెలుగు చిత్రం

## తెలుగు చలనచిత్ర చరిత్రలో తిరుగులేని ముద్ర వేసిన 'రైతుబిడ్డ'

## నేడు తొలితరం నటి కొమ్మూరి పద్మావతీదేవి జయంతి

తెలుగు చలనచిత్ర చరిత్రలో సామాజిక చైతన్యానికి నాంది పలికిన చిత్రాల్లో 'రైతుబిడ్డ'కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రభుత్వ నిషేధానికి గురైన తొలి తెలుగు చిత్రంగా ఈ సినిమా చరిత్రలో నిలిచిపోయింది. రైతాంగం ఎదుర్కొంటున్న అన్యాయాలు, జమీందారీ వ్యవస్థ దౌర్జన్యాలను నిర్భయంగా తెరపై ఆవిష్కరించిన ఈ చిత్రం అప్పటి సమాజాన్ని కుదిపేసింది. ఈ చిత్రంలో కథానాయకుడి భార్య పాత్రలో నటించిన తొలితరం రంగస్థల, సినీ నటి కొమ్మూరి పద్మావతీదేవి జయంతి సందర్భంగా ఆమె సేవలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. 1939లో దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం రూపొందించిన రైతుబిడ్డ ఆ కాలంలోనే సంచలనానికి కేంద్రబిందువైంది. రైతులపై జమీందార్లు సాగిస్తున్న దోపిడీ, అన్యాయాలను యథాతథంగా చిత్రీకరించడంతో జమీందార్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి, వెంకటగిరి సంస్థానాధిపతులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సినిమా ప్రదర్శనను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. కొన్నిచోట్ల సినిమా ప్రింట్లను తగలబెట్టించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఈ చిత్రం ప్రభుత్వ నిషేధానికీ గురైంది. దీంతో తెలుగు సినీ చరిత్రలో నిషేధానికి గురైన తొలి చిత్రంగా రైతుబిడ్డ చిరస్థాయిగా నిలిచింది. ఈ చిత్రానికి గూడవల్లి




రామబ్రహ్మం దర్శకత్వం వహించగా, తాపీ ధర్మారావు నాయుడు, త్రిపురనేని గోపీచంద్ సంభాషణలు అందించారు. సముద్రాల రాఘవాచార్య, తాపీ ధర్మారావు, కొసరాజు రాఘవయ్య చౌదరి రచించిన పాటలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతు ఉద్యమ నాయకుల రచనలు, తుమ్మల సీతారామమూర్తి పద్యాలను కూడా సినిమాలో వినియోగించడం విశేషం.కథానాయకుడైన రైతు పెద్ద నర్సిరెడ్డి పాత్రలో బళ్లారి రాఘవ అద్భుత నటన కనబరిచారు. ఆయన భార్య పాత్రలో కొమ్మూరి పద్మావతీదేవి తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. రైతు కుమార్తె పాత్రలో అప్పటి బాలనటి టంగుటూరి సూర్యకుమారి నటించారు. భీమవరపు నరసింహారావు సంగీతం, వేదాంతం రాఘవయ్య నృత్య దర్శకత్వం చిత్రానికి మరింత విలువ చేకూర్చాయి. ప్రముఖ కళాదర్శకుడు మాధవపెద్ది గోఖలే కూడా ఈ చిత్రంతోనే సినీరంగంలో అడుగుపెట్టారు.

1939 ఆగస్టు 27న విడుదలైన రైతుబిడ్డ కేవలం సినిమా మాత్రమే కాదు... ఒక సామాజిక ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. "దున్నేవాడిదే భూమి", "జమీందారీ వ్యవస్థ రద్దు కావాలి" వంటి భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. తర్వాత జమీందారీ రద్దు చట్టాలపై ప్రజాభిప్రాయం బలపడటంలో ఈ సినిమా ప్రభావం ఎంతో ఉందని అప్పటి రాజకీయ, సామాజిక వర్గాలు పేర్కొన్నాయి. తొలితరం నటి కొమ్మూరి పద్మావతీదేవి నటించిన ఈ చారిత్రక చిత్రం నేటికీ తెలుగు సినిమా చరిత్రలో సామాజిక చైతన్యానికి చిరస్మరణీయ నిదర్శనంగా నిలిచింది. రైతు సమస్యలను వెండితెరపై ధైర్యంగా ఆవిష్కరించిన ఈ చిత్రం, తెలుగు సినీ చరిత్రలో ఎప్పటికీ చెరగని అధ్యాయంగా మిగిలిపోతుంది.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పాలక, ప్రతిపక్షాల శపథాల పర్వం

## ప్రజాస్వామ్య పారదర్శకతకు పరీక్షా సమయం

తెలంగాణ రాజకీయ యవనికపై ఇటీవలి కాలంలో 'ఛాలెంజ్' (సవాళ్లు–ప్రతిసవాళ్లు) రాజకీయాలు సరికొత్త ఒరవడిగా ఆవిష్కృతమవుతున్నాయి. అధికార పక్షానికి చెందిన మంత్రులు ఒకవైపు, సుదీర్ఘకాలం పాలించి ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అగ్రనేతలు మరోవైపు పరస్పరం విసురుకుంటున్న రాజకీయ శపథాలు రాష్ట్రంలో పతాక స్థాయి చర్చకు దారితీస్తున్నాయి. ఒకరి పరిపాలనా కాలపు లోపాలను మరొకరు ఎండగట్టడం, అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలనకు బహిరంగ ఆహ్వానాలు పంపడం, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రత్యక్షంగా జనం సమక్షంలోనే తేల్చుకుందామని సవాలు చేయడం వంటి పరిణామాలు నిత్యకృత్యమయ్యాయి. దీనివల్ల సిద్ధాంతపరమైన, విధానపరమైన లోతైన చర్చల కంటే ప్రచారాత్మక సవాళ్లు, సామాజిక మాధ్యమాల కేంద్రంగా సాగే తక్షణ ప్రతిస్పందనలకే ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, అటు పాలక వర్గం, ఇటు ప్రతిపక్షం అనుసరిస్తున్న ఈ సరికొత్త వ్యూహం నిజంగా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారుతోందా లేక కేవలం ప్రజల దృష్టిని మళ్లించే ప్రచార రాజకీయాల కొత్త పంథానా అనే కోణంలో సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భారత ప్రజాస్వామ్య చరిత్రలో రాజకీయ పక్షాలు సవాళ్లు విసురుకోవడం కొత్తేమీ కాకపోయినప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు సామాజిక మాధ్యమాల విస్తృతి తరవాత ఈ ధోరణి స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు శాసనసభల వేదికగా, బహిరంగ ప్రజా సభల్లో లేదా పత్రికా ప్రకటనల ద్వారా హుందాగా సాగిన విమర్శలు, ఇప్పుడు క్షణాల వ్యవధిలో స్మార్ట్‌ఫోన్ తెరలపై ప్రత్యక్ష వీడియోలుగా, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల పోస్టులుగా రూపాంతరం చెందాయి. తెలంగాణలో డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాల అనంతరం ఈ ధోరణి మరింత తీవ్రరూపం దాల్చింది. ఆ ఎన్నికల్లో మొత్తం 119 స్థానాలకు గాను కాంగ్రెస్ జ్యూభితీఎ 64 స్థానాల్లో విజయం సాధించి అధికార పీఠాన్ని కైవసం చేసుకోగా, గత పదేళ్లుగా తిరుగులేని శక్తిగా వెలిగిన బీఆర్ఎస్ 39 స్థానాలకు పరిమితమై ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించింది. అలాగే బీజేపీ 8 స్థానాలను, ఎంఐఎం 7 స్థానాలను, సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. ఈ బలాల సమీకరణాల మార్పు కేవలం అధికార బదలాయింపునకే పరిమితం కాకుండా, రాజకీయ సంభాషణల శైలిని కూడా మార్చివేసింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తేలికగా కొట్టిపారేసిన నాటి బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రతిపక్ష భూమికలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' మరియు ఇతర ఎన్నికల హామీల అమలుపై నిలదీస్తున్నారు. దీనికి ప్రతిగా అధికార కాంగ్రెస్ మంత్రులు సైతం రక్షణాత్మక ధోరణిని వీడి, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం, ప్రాజెక్టుల వైఫల్యాలు, పెరిగిన అప్పుల భారాన్ని ప్రస్తావిస్తూ ఎదురుదాడికి దిగుతున్నారు. ఈ క్రమంలోనే వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి వంటి కీలక రంగాలన్నీ సవాళ్ల రాజకేయంలో పావులుగా మారుతున్నాయి. ఉదాహరణకు, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కుంగిపోవడంపై ఇరుపక్షాల నేతలు క్షేత్రస్థాయికి వెళ్లి నిజానిజాలు తేల్చుకుందామని సవాలు విసురుకోవడం, అలాగే దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ రుణమాఫీ అమలుపై లబ్ధిదారుల జాబితాతో సహా గ్రామాల్లో ప్రజా కోర్టుల తరహాలో చర్చకు రావడం వంటి సంఘటనలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలుగా



నిలుస్తున్నాయి.

ఈ సవాళ్ల రాజకీయ శైలిని పరిశీలిస్తే రెండు స్పష్టమైన భిన్న కోణాలు గోచరిస్తాయి. మొదటిది, ప్రజాస్వామ్య పారదర్శకత. ప్రజాప్రతినిధులు లేదా మంత్రులు తాము చేసిన పనులను నిరూపించడానికి లేదా ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడానికి ప్రజల ముందుకు వెళ్తామని ప్రకటించడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సూచికగానే భావించవచ్చు. దీనివల్ల క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఏమిటనేది ప్రజలకు నేరుగా తెలిసే అవకాశం ఉంటుంది. అయితే, దీని వెనుక ఉన్న రెండో కోణమైన ప్రచార రాజకీయాలను విస్మరించలేము. ఏదైనా ఒక తీవ్రమైన ప్రభుత్వ వైఫల్యం లేదా ప్రతిపక్షాల వైఫల్యం చర్చకు వచ్చినప్పుడు, దాన్ని ఒక సవాలుగా మార్చడం ద్వారా మీడియా శ్రద్ధను మొత్తం తమ వైపు తిప్పుకోవడం రాజకీయ నేతలకు సులువవుతోంది. తద్వారా అసలు సమస్యా మూలాల్లోకి వెళ్లకుండా, కేవలం ఎవరు ఎవరి సవాలును స్వీకరించారు, ఎవరు వెనక్కి తగ్గారు అనే అంశాల చుట్టూనే చర్చను పరిభ్రమించేలా చేసి, ప్రత్యర్థిని రక్షణాత్మక స్థితిలోకి నెట్టే వ్యూహం ఇందులో అంతర్లీనంగా దాగి ఉంది. రాజకీయ విశ్లేషకుల లోతైన అభిప్రాయం ప్రకారం, ఇటువంటి సవాళ్ల రాజకీయాలు సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ యువతలో లేదా పార్టీ కార్యకర్తల్లో తాత్కాలికంగా ఉద్వేగాన్ని, ఆసక్తిని కలిగించవచ్చు. కానీ, దీర్ఘకాలిక పరిపాలనా ప్రస్థానంలో ప్రజలు కేవలం మాటల చాతుర్యాన్ని కాకుండా క్షేత్రస్థాయిలో లభించే ఫలితాలనే కొలమానంగా తీసుకుంటారు. ఒక సామాన్య పౌరుడికి కావలసింది నిరంతర విద్యుత్ సరఫరా, సకాలంలో అందే ఉపాధి అవకాశాలు, నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం మరియు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ. వీటిని ఏ ప్రభుత్వం ఎంతవరకు సాధించగలిగింది, ప్రతిపక్షంగా ఉన్న పార్టీ విమర్శలకే పరిమితం కాకుండా ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రజల ముందు ఉంచగలిగింది అనే అంశాలే అంతిమంగా ప్రజా తీర్పును శాసిస్తాయి. సోషల్ మీడియాలో ఒక మంత్రి విసిరిన సవాలుకు కొన్ని నిమిషాల్లోనే లక్షలాది వ్యూస్, లైకులు రావచ్చు; కానీ అదే సమయంలో రేషన్ దుకాణాల ముందు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులకు అవి ప్రత్యామ్నాయం కాలేవు. పరిణతి చెందిన ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు సహజం మరియు ఆవశ్యకం కూడా. అయితే అవి కేవలం వ్యక్తిగత దూషణలు, ఈగోల చుట్టూ తిరిగే సవాళ్లుగా మిగిలిపోకుండా, వాస్తవ ఆధారిత మరియు గణాంకాలతో కూడిన చర్చలుగా మారాలి. రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్), పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, ఐటీ రంగ విస్తరణతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వంటి విషయాలపై ఇరుపక్షాలు తమ వద్ద ఉన్న అధికారిక సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలి. అప్పుడే ప్రజలు కూడా స్వతంత్ర సంస్థల నివేదికలను, కాగ్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థల గణాంకాలను పరిశీలించి, ఏది నిజం ఏది ప్రచార ఆర్భాటం అనేది విశ్లేషించుకునే వివేచనను పొందుతారు. కేవలం సవాళ్లు విసురుకుంటూ కాలయాపన చేయడం వల్ల వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోయే ప్రమాదం ఉంది.

తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న మంత్రులు– బీఆర్ఎస్ నేతల ఛాలెంజ్ రాజకీయాలు రాష్ట్ర రాజకీయ చైతన్యానికి, దూకుడు స్వభావానికి అద్దం పడుతున్నప్పటికీ, ఇవి ప్రజాస్వామ్య పరిపక్వతకు సరైన సంకేతం కావు. రాజకీయ నాయకుల ఆకాంక్షలు ఎలా ఉన్నా, ప్రజల ఆకాంక్షలు మాత్రం ఎల్లప్పుడూ స్థిరమైన పరిపాలనా తీరు, ఆర్థికాభివృద్ధి మరియు సంక్షేమం వైపునకే ఉంటాయి. ఒకరిపై ఒకరు మాటల యుద్ధాలు చేసుకోవడం కంటే, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఎలా నెరవేరుస్తున్నామో తెలిపే ప్రగతి నివేదికలను పారదర్శకంగా సమర్పించడం, ప్రతిపక్షాలు చేసే విమర్శల్లోని సత్యాన్ని గ్రహించి పాలనను మెరుగుపరుచుకోవడం పాలకుల బాధ్యత. అలాగే ప్రతిపక్షం కూడా కేవలం ప్రతిబంధకంగా మారకుండా, బాధ్యతాయుతమైన ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలి. ఈ సవాళ్ల రాజకీయాలు కేవలం తాత్కాలిక మీడియా ప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోకుండా, నిజమైన ప్రజా సమస్యల పరిష్కారానికి, విధానపరమైన మార్పులకు దారితీసే ఆరోగ్యకరమైన చర్చలుగా రూపాంతరం చెందినప్పుడే వాటికి ప్రజాస్వామ్యంలో శాశ్వత విలువ, గౌరవం లభిస్తాయి. చివరికి ప్రజల తీర్పును నిర్ణయించేది సవాళ్ల హోరు కాదు; నిశ్శబ్దంగా జరిగే అభివృద్ధి, లభించే సుపరిపాలన మాత్రమే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు

మంగళవారం 07 జూలై 2026



## స్వల్పంగా తగ్గిన బంగారం

**హైదరాబాద్, జూలై 7 :** దేశీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.110, 22 క్యారెట్ల బంగారంపై రూ.100, 18 క్యారెట్ల బంగారంపై రూ.80 తగ్గాయి. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,620, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,400, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,970 వద్ద నమోదైంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఈ పట్టణాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,46,620, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,400, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,970గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, కడప నగరాల్లో కూడా బంగారం ధరలు హైదరాబాద్‌తో సమానంగా నమోదయ్యాయి. ఈ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,46,620, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,400, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,970గా విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో మాత్రం బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,47,930, 22 క్యారెట్ల బంగారం రూ.1,35,600, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,000గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా, ఇండోర్, కాన్పూర్ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,46,620, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,400, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,970 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లోని ఒడిదుడుకులు, డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల కొనుగోళ్లపై ఆధారపడి ప్రతిరోజూ మారుతూ ఉంటాయి. కొనుగోలు చేసే ముందు స్థానిక బంగారం వ్యాపారులను సంప్రదించి తాజా ధరలను తెలుసుకోవడం మంచిది.




## ఈ20 పెట్రోల్‌పై మహీంద్రా క్లారిటీ..

### పాత వాహనాలకూ సురక్షితమే!

**హైదరాబాద్, జులై 6 :** ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. ఈ ఇంధనం వల్ల వాహనాల ఇంజిన్‌పై ప్రతికూల ప్రభావం ఉంటుందంటూ సామాజిక మాధ్యమాల్లో పలు ప్రచారాలు జరుగుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ20 పెట్రోల్ వల్ల ఇంజిన్‌కు ఎలాంటి నష్టం ఉండదని, కేవలం ఇంధన వినియోగ సామర్థ్యంలో స్వల్ప తగ్గుదల మాత్రమే ఉండవచ్చని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా కూడా ఈ20 పెట్రోల్‌పై కీలక వివరణ ఇచ్చింది. మహీంద్రా వెల్లడించిన వివరాల ప్రకారం.. తమ పెట్రోల్ కార్లన్నింటిలోనూ ఈ20 ఇంధనాన్ని ఎలాంటి ఆందోళన లేకుండా ఉపయోగించవచ్చని సంస్థ తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇంధన ప్రమాణాలకు అనుగుణంగానే తమ పెట్రోల్ ఇంజిన్లను రూపొందించినట్లు వెల్లడించింది. సామాజిక మాధ్యమాల్లో ఓ వినియోగదారు అడిగిన ప్రశ్నకు స్పందించిన సంస్థ.. 2025 ఏప్రిల్ 1 తర్వాత తయారైన వాహనాల్లో ఈ20 ఇంధనానికి అనుగుణంగా ఇంజిన్‌ను ప్రత్యేకంగా సర్దుబాటు చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త తరం వాహనాల్లో ఈ20 ఇంధనంతో మెరుగైన వేగవృద్ధి, ఇంధన సామర్థ్యం లభిస్తాయని మహీంద్రా తెలిపింది. అలాగే 2025 ఏప్రిల్‌కు ముందు తయారైన పెట్రోల్ వాహనాలు కూడా ఈ20 ఇంధనంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తాయని స్పష్టం చేసింది. అయితే వాహనం నడిపే విధానం, రహదారి పరిస్థితులు, ట్రాఫిక్‌ను బట్టి ఇంధన వినియోగం లేదా వేగవృద్ధిలో స్వల్ప మార్పులు కనిపించవచ్చని పేర్కొంది. ఇటీవల ఈ20 పెట్రోల్‌పై సామాజిక మాధ్యమాల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వినియోగదారుల ఆందోళనలను తగ్గించేందుకే ఈ వివరణ ఇచ్చినట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో టయోటా, మారుతి సుజుకీ, హీరో మోటోకార్ప్, హ్యుందాయ్ ప్రతినిధులు కూడా ఈ20 ఇంధనం వాహనాలకు పూర్తిగా సురక్షితమేనని పేర్కొన్నారు. ఇంధన వినియోగ సామర్థ్యంలో స్వల్ప తగ్గుదల ఉండొచ్చని, అయితే ఇంజిన్ పనితీరు లేదా జీవితకాలంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.

# ముడి చమురు ఉత్పత్తి పెంపు

### పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశాలు



**న్యూఢిల్లీ, జూలై 6 :** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒపెక్ ప్లస్ కూటమి మరోసారి చమురు ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించడంతో ప్రపంచ మార్కెట్లో సరఫరా పెరిగే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒపెక్ ప్లస్ సభ్య దేశాలు తాజాగా నిర్వహించిన సమావేశంలో ఆగస్టు నుంచి రోజుకు అదనంగా 1.88 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉత్పత్తి చేయాలని నిర్ణయించాయి. ఇప్పటికే గత నాలుగు నెలలుగా ఉత్పత్తిని పెంచుతున్న కూటమి వరుసగా ఐదోసారి ఈ నిర్ణయం తీసుకుంది. సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, కువైట్, అల్జీరియా, కజకిస్తాన్, ఒమన్ తదితర దేశాలు ఈ నిర్ణయానికి మద్దతు తెలిపాయి. ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా పెరిగితే సాధారణంగా ముడి చమురు ధరలు తగ్గుతాయి. దీంతో ఇంధన సంస్థల కొనుగోలు వ్యయం తగ్గే అవకాశం ఉంటుంది. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరలపై పడే అవకాశముంది. రవాణా వ్యయం తగ్గడం వల్ల ఇతర వస్తువుల ధరలపైనా సానుకూల ప్రభావం కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఒపెక్ ప్లస్ కూటమి అంతర్గతంగా కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముఖ్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గతంలో ఉత్పత్తి పరిమితులపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రపంచ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి పెంపు వ్యూహాన్ని సభ్య దేశాలు కొనసాగిస్తున్నాయి. భారత్ తన ముడి చమురు అవసరాల్లో సుమారు 85 నుంచి 88 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో అధిక భాగం ఒపెక్ ప్లస్ దేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఇరాక్, సౌదీ అరేబియా, రష్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు భారత్‌కు ప్రధాన సరఫరాదారులుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గితే దేశీయ చమురు సంస్థలపై భారం తగ్గే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గిన వెంటనే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని చెప్పలేమని నిపుణులు పేర్కొంటున్నారు. ముడి చమురు ధరలతో పాటు రూపాయి-డాలర్ మారకం విలువ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పన్నులు, రవాణా వ్యయం, శుద్ధి ఖర్చులు వంటి అంశాలు కూడా ఇంధన ధరలను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా పెరగడం భారత వినియోగదారులకు ఊరటనిచ్చే పరిణామంగా భావిస్తున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలను బట్టి ఇంధన ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# కోర్టు వీడియోలపై గూగుల్ వివరణ




**న్యూఢిల్లీ, జులై 7 :** కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక వీడియోలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడం లేదా తొలగించడం సాంకేతికంగా సాధ్యం కాదని ప్రముఖ సాంకేతిక సంస్థ గూగుల్ ఢిల్లీ హైకోర్టుకు స్పష్టం చేసింది. అలాంటి వీడియోలను స్వయంగా గుర్తించి తొలగించే బాధ్యత తమపై లేదని, న్యాయస్థానం నిర్దిష్టంగా సూచించిన వీడియోలపైనే చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని అఫిడవిట్‌లో పేర్కొంది. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోర్టు విచారణకు హాజరైన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో ఈ అంశం న్యాయస్థానం ముందుకు వచ్చింది. కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగ్‌లు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది వైభవ్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన గూగుల్.. పిటిషనర్ సూచించిన వీడియోలను ఇప్పటికే తొలగించి, దేశంలో అందుబాటులో లేకుండా నిరోధించినట్లు తెలిపింది. అయితే ప్రతిరోజూ యూట్యూబ్‌లో లక్షల సంఖ్యలో వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయని, వాటన్నింటినీ ముందుగానే పరిశీలించి కోర్టు విచారణలకు సంబంధించిన వీడియోలను గుర్తించడం ఆచరణలో సాధ్యం కాదని వివరించింది. ఏ వీడియో చట్టవిరుద్ధమో, ఏది చట్టబద్ధమో నిర్ణయించే అధికారం న్యాయస్థానాలకే ఉంటుందని, తాము కేవలం డిజిటల్ వేదికను నిర్వహించే మధ్యవర్తి మాత్రమేనని గూగుల్ స్పష్టం చేసింది. న్యాయస్థానం నిర్దిష్ట వీడియోల చిరునామాలను పేర్కొంటూ ఆదేశాలు జారీ చేసిన తర్వాత మాత్రమే వాటిని తొలగించే అవకాశం ఉంటుందని వెల్లడించింది. కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగ్‌లు న్యాయవ్యవస్థ గౌరవానికి భంగం కలిగించే అవకాశం ఉందని గతంలో ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. అలాంటి రికార్డింగ్‌లను నియంత్రించే విషయంలో సమర్థవంతమైన విధానం అవసరమని కూడా పేర్కొంది. అయితే సాంకేతిక వేదికలు ప్రతి క్షణం అప్‌లోడ్ అయ్యే సమాచారాన్ని ముందుగానే పరిశీలించడం సాధ్యం కాదని గూగుల్ తన వాదనలో స్పష్టం చేసింది. తాజా పరిణామంతో న్యాయవ్యవస్థ గౌరవాన్ని పరిరక్షించడం, ప్రజలకు సమాచార స్వేచ్ఛ కల్పించడం, సాంకేతిక వేదికల బాధ్యతల మధ్య సమతుల్యత ఎలా ఉండాలనే అంశంపై మరోసారి చర్చ మొదలైంది. న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటామని గూగుల్ మరోసారి స్పష్టం చేసింది.

# ఐఫోన్ 17పై భారీ తగ్గింపు..

### ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్‌లో అదిరే ఆఫర్లు

**హైదరాబాద్, జులై 7 :** కొత్త స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ కొనుగోలు చేయాలనుకునే టెక్ ప్రియులకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ గుడ్‌న్యూస్ చెప్పింది. సంస్థ నిర్వహిస్తున్న 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సేల్‌లో భాగంగా యాపిల్ తాజా ఐఫోన్ సిరీస్‌తో పాటు పలు ప్రముఖ బ్రాండ్ల గ్యాడ్జెట్లపై భారీ ధర తగ్గింపులు ప్రకటించింది. ముఖ్యంగా ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై ఏకంగా రూ.20 వేల వరకు తగ్గింపు లభించడం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. ఈ సేల్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ అసలు ధర రూ.1,49,900 కాగా, ఫ్లాట్ డిస్కౌంట్, ఎంపిక చేసిన బ్యాంకు కార్డు ఆఫర్లు, అదనపు క్యాష్‌బ్యాక్‌లతో కలిపి రూ.1,29,900కే అందుబాటులోకి వచ్చింది. ఐఫోన్ 17 బేస్ మోడల్ అసలు ధర రూ.82,900 కాగా, సేల్‌లో రూ.70,900కే లభిస్తోంది. అలాగే ఐఫోన్ 17 ప్రో మోడల్ ధరను రూ.1,12,900కు తగ్గించారు. పాత తరం ఐఫోన్ 15పై కూడా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. యాపిల్ ఉత్పత్తులతో పాటు పలు ఆండ్రాయిడ్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లపై కూడా భారీ తగ్గింపులు ఉన్నాయి. శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్26 సిరీస్, గెలాక్సీ ఎస్25 ఎఫ్ఈ మోడళ్లతో పాటు మోటో జీ37 పవర్ స్మార్ట్‌ఫోన్ ఆకర్షణీయమైన ధరలకు లభిస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని అసుస్ వివోబుక్ 15 ల్యాప్‌టాప్, రెడ్‌మీ ప్యాడ్ 2, శామ్‌సంగ్ గెలాక్సీ ట్యాబ్ ఏ11ం వంటి పరికరాలపై కూడా ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు అదనంగా ఐదు శాతం అపరిమిత క్యాష్‌బ్యాక్ లభిస్తుందని సంస్థ వెల్లడించింది. అలాగే పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేసే వారికి అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ కూడా అందుబాటులో ఉంది. పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉండనున్నందున ఆసక్తి ఉన్న వినియోగదారులు త్వరగా కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.







## ఇంధన ధరలు స్థిరం

### తెలుగు రాష్ట్రాల్లో నేటి పెట్రోల్, డీజిల్ రేట్లు ఇవే

**హైదరాబాద్, జులై 6 :** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయాలు, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నుల ఆధారంగా దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు పెట్రోల్, డీజిల్ ధరలను సవరిస్తుంటాయి. అయితే నేడు తెలుగు రాష్ట్రాల్లో ఇంధన ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ధరలే ఇవాళ కూడా అమలులో ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.116.99గా, డీజిల్ ధర రూ.105.03గా కొనసాగుతోంది. నగరంలోని అన్ని ప్రధాన పెట్రోల్ బంకుల్లో ఇదే ధరలు అమలులో ఉన్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల్లో కూడా ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. అయితే స్థానిక రవాణా వ్యయాలు, డీలర్ కమిషన్‌ల కారణంగా జిల్లాల వారీగా స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో రాష్ట్రంలోనూ ఇంధన ధరలు స్థిరంగా ఉన్నాయి. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రధాన నగరాల్లో కూడా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. స్థానిక పన్నుల ప్రభావంతో జిల్లాల మధ్య స్వల్ప ధరల తేడాలు ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా వాహనదారులపై అదనపు భారం పడలేదు.

# బ్రెజిల్‌పై స్టన్నింగ్ విక్టరీ



## నార్వేను గెలిపించిన హాలాండ్

**న్యూజెర్సీ:** ఫిఫా వరల్డ్‌కప్‌లో సంచలనం నమోదు అయ్యింది. అయిదు సార్లు ప్రపంచ కప్ విజేత బ్రెజిల్.. రౌండ్16లో ఓటమి పాలైంది. న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో నార్వే విజయం సాధించి క్వార్టర్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఫిఫా వరల్డ్‌కప్‌లో నార్వే క్వార్టర్స్‌కు ప్రవేశించడం ఇదే మొదటిసారి. స్టార్ ప్లేయర్ ఎర్లింగ్ హాలాండ్ అద్భుతమైన గేమ్‌తో ఆకట్టుకున్నాడు. అతను రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 1990 వరల్డ్‌కప్ తర్వాత రౌండ్16లో బ్రెజిల్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. ఈ వరల్డ్‌కప్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న హాలాండ్ మరోసారి అదే దూకుడు ప్రదర్శించాడు. టోర్నమెంట్‌లో ఆరు, ఏడవ గోల్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే టోర్నీలో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాప్పే, మెస్సీతో సమంగా హాలాండ్ నిలిచాడు. 25 ఏళ్ల ఆ స్ట్రయికర్ మరో కీలకమైన మైలురాయి చేరుకున్నాడు. నార్వే తరపున 54 మ్యాచుల్లో 62 గోల్స్ చేశాడు. నార్వే తరపున ఆడిన చివరి 14 మ్యాచుల్లో హాలాండ్ మొత్తం 27 గోల్స్ చేసి తన ఫామ్‌ను చాటుకున్నాడు. ఈ మ్యాచ్‌లో హాలాండ్ 79, 90వ నిమిషాల్లో రెండు గోల్స్ చేశాడు. ఇక బ్రెజిల్ తరపున నేమార్ 90 నిమిషంలో గోల్ చేశాడు. వాస్తవానికి ఆరంభంలో బ్రెజిల్‌కు పెనాల్టీ దొరికింది. కానీ నార్వే గోల్‌కీపర్ ఓర్జన్ నైలాండ్ అద్భుతంగా సేవ్ చేయడంతో.. గోల్ చేసే అవకాశాన్ని ఆ జట్టు కోల్పోయింది. దాదాపు రెండో అర్ధ భాగం చివరి దశ వరకు రెండు జట్లు హోరాహోరీగా పోరాడాయి. జూలై 11వ తేదీన క్వార్టర్స్‌లో ఇంగ్లండ్‌తో నార్వే తలపడనున్నది.



# భారత్-ఏ ఘనవిజయం

### గుర్నూర్‌కు పది వికెట్లు

**గాలె:** శ్రీలంక పర్యటనలో భారత్-ఏ జట్టు అదరగొట్టింది. ఇరుజట్ల మధ్య ఆదివారం ముగిసిన రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ.. శ్రీలంక-ఏపై 10 వికెట్ల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టిన భారత పేసర్ గుర్నూర్ బ్రర్.. రెండో ఇన్నింగ్స్‌లో (6/68) ఆరు వికెట్లు తీసి పర్యాటక జట్టుకు ఘనవిజయాన్ని అందించాడు. నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌ను 543/9 వద్ద భారత్ డిక్లేర్డ్ చేయగా రెండో ఇన్నింగ్స్‌లో లంకేయులు 209 రన్స్‌కే కుప్పకూలారు. 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జురెల్ సేన వికెట్లేమీ కోల్పోకుండానే ఛేదించింది.

# ప్రమాదంలో టీమిండియా బ్యాటింగ్

## ముందు ఆ 'వైభవ్'ను తీసేయండి..

### సంజూ శాంసన్‌ను పక్కనబెట్టడంపై మహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి

### టాప్ ఆర్డర్‌లో ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లా? టీమ్ మేనేజ్‌మెంట్‌పై మాజీ క్రికెటర్ విమర్శలు





**ముంబై:** భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన రెండో టీ-20 మ్యాచ్‌లో సంజూ శాంసన్ స్థానంలో కేవలం 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీని అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయించడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మొన్నటి టీ-20 ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన శాంసన్ లాంటి సీనియర్, ఫామ్‌లో ఉన్న ఆటగాడిని తుది జట్టు నుంచి తప్పించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదాస్పద నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందిస్తూ.. టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్ కూర్పును కైఫ్ విశ్లేషించారు. అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ, ఓపెనర్ అభిషేక్ శర్మ ఇద్దరూ ఎడమచేతి వాటం (లెఫ్ట్ హ్యాండర్స్) బ్యాటర్లేనని ఆయన గుర్తుచేశారు. భారత టాప్-7 బ్యాటింగ్ లైనప్‌లో ఏకంగా ఆరుగురు ఎడమచేతి వాటం ఆటగాళ్లే ఉండటం వ్యూహాత్మకంగా జట్టుకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని కైఫ్ అభిప్రాయపడ్డారు. ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లే ఓపెనింగ్‌కు వస్తే, ప్రత్యర్థి జట్టు ఆరంభంలోనే ఆఫ్ స్పిన్నర్లను రంగంలోకి దించి భారత్‌పై సులభంగా ఒత్తిడి పెంచగలదని హెచ్చరించారు. రెండో టీ-20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పార్ట్-టైమ్ ఆఫ్ స్పిన్నర్ విల్ జాక్స్ బౌలింగ్‌లోనే వైభవ్ సూర్యవంశీ స్టంప్ అవుట్ అవ్వడమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. గతంలో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఓపెనింగ్ చేసినప్పుడు కూడా ఇదే సమస్య వల్ల పెద్ద భాగస్వామ్యాలు నమోదు కాలేదని గుర్తుచేసిన కైఫ్.. ఇది రాబోయే మ్యాచ్‌లలో టీమిండియాకు పెద్ద ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు.

### శాంసన్‌ను తిరిగి తీసుకురావాలి..


భారత జట్టు విజయవంతం కావాలంటే సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడం అత్యంత అవసరమని కైఫ్ స్పష్టం చేశారు. ఒకవేళ కుర్రాళ్లను ఆడించాలనుకుంటే.. వైభవ్ లేదా అభిషేక్ లలో ఒకరిని నంబర్ 3 స్థానానికి మార్చి, ఓపెనింగ్‌లో ఒక కుడిచేతి వాటం (రైట్ హ్యాండర్) బ్యాటర్‌ను బరిలోకి దించాలని సూచించారు. శాంసన్ ఎంతటి ఒత్తిడినైనా అధిగమించి అద్భుతంగా 'బౌన్స్ బ్యాక్' అయ్యే సత్తా ఉన్న ఆటగాడని ఆయన కొనియాడారు. వైభవ్ సూర్యవంశీ అసాధారణ ప్రతిభను తాను స్వాగతిస్తున్నప్పటికీ, శాంసన్ లాంటి అనుభవజ్ఞుడిని పక్కనబెట్టి ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లతో ఓపెనింగ్ ప్రయోగాలు చేయడం భారత జట్టు దీర్ఘకాలిక ప్రయోజనాలకు మంచిది కాదని కైఫ్ హెచ్చరించారు.

# చాలాసార్లు మోసపోయా.. ప్రతి రూమర్ నిజమే

### పృథ్వీ షా కాబోయే భార్య అకృతి అగర్వాల్ క్రిప్టిక్ పోస్టులు వైరల్

### షాను ఉద్దేశించిందేనా?.. సోషల్ మీడియాలో జోరుగా చర్చ


**న్యూఢిల్లీ, జూలై 6:** భారత క్రికెటర్ పృథ్వీ షా వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆయనకు నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అకృతి అగర్వాల్ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన కొన్ని క్రిప్టిక్ పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాను చాలాసార్లు మోసపోయానని, సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రతి రూమర్ నిజమేనంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అకృతి తన పోస్టులో.. "నన్ను చాలాసార్లు మోసం చేశారు. అయినా నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతడితో జీవితంలో ముందడుగు వేసిన తర్వాత ఇలా జరుగుతుందని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను" అని పేర్కొన్నారు. మరో పోస్టులో.. "అతడి గురించి సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి రూమర్ నిజమే" అని రాసుకొచ్చారు. అయితే ఈ పోస్టుల్లో ఎక్కడా పృథ్వీ షా పేరును ఆమె ప్రస్తావించలేదు. అనంతరం ఆ పోస్టులను ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాఖ్యలు పృథ్వీ షాను ఉద్దేశించే చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయినప్పటికీ ఈ విషయంపై ఇప్పటివరకు పృథ్వీ షా గానీ, అకృతి అగర్వాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. ఆసక్తికరంగా, అకృతి ఇప్పటికీ పృథ్వీ షాను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతుండగా, వారి నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలు కూడా ఆమె ఖాతాలో అలాగే ఉన్నాయి. దీంతో ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. పృథ్వీ షా, అకృతి అగర్వాల్ ఈ ఏడాది మార్చిలో తమ నిశ్చితార్థాన్ని అధికారికంగా ప్రకటించారు. చాలా కాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట తమ బంధాన్ని అభిమానులతో పంచుకోవడంతో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అకృతి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. మరోవైపు పృథ్వీ షా క్రికెట్ కెరీర్ కూడా గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. ఐపీఎల్-2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ సమస్యలు, పేలవమైన ఫామ్ కారణంగా జాతీయ జట్టుకు కూడా దూరమయ్యాడు. అయితే ఇటీవల తన పునరాగమనంపై స్పందిస్తూ.. భారత్ తరఫున మళ్లీ ఆడటమే తన లక్ష్యమని, మానసికంగా మరింత బలంగా తయారయ్యేందుకు విరామం తీసుకున్నానని, ఇప్పుడు మూడు రెట్లు ఎక్కువగా సాధన చేస్తున్నానని పృథ్వీ షా వెల్లడించారు.



# లార్డ్స్‌లో ఇంగ్లండ్‌కు చెక్!

- ఏడోసారి ప్రపంచ విజేతగా ఆస్ట్రేలియా
- 'ఆ మజానే వేరప్ప'.. ఆనందంలో ఎల్లీస్ పెర్రీ
- లార్డ్స్‌లో ఫైనల్ గెలవడం జీవితాంతం గుర్తుండిపోతుందన్న ఆసీస్ స్టార్





**లండన్, జూలై 6:** మహిళల టీ20 ప్రపంచకప్-2026 ఫైనల్లో ఇంగ్లండ్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించి ఆస్ట్రేలియా రికార్డు స్థాయిలో ఏడోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ చారిత్రక విజయంపై ఆసీస్ స్టార్ ఆల్‌రౌండర్ ఎల్లీస్ పెర్రీ ఆనందం వ్యక్తం చేశారు. లార్డ్స్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై, ఇంగ్లండ్ లాంటి బలమైన జట్టును ఓడించి ట్రోఫీని అందుకోవడం తన కెరీర్‌లో ఎప్పటికీ మరచిపోలేని క్షణమని పేర్కొన్నారు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన పెర్రీ.. లార్డ్స్‌లోని వాతావరణం, అభిమానుల ఉత్సాహం, ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ అన్నీ కలిపి ఈ విజయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని అన్నారు. టోర్నమెంట్ మొత్తం అద్భుతంగా ఆడిన ఇంగ్లండ్‌పై గెలవడం తమ జట్టుకు గొప్ప సంతృప్తిని ఇచ్చిందని చెప్పారు. కెప్టెన్ సోఫీ మోలినెక్స్ నాయకత్వాన్ని పెర్రీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కెప్టెన్‌గా ఆమెకు ఇదే తొలి ప్రపంచకప్ అని, జట్టును అద్భుతంగా నడిపించారని కొనియాడారు. ప్రతి మ్యాచ్‌లో ఆటగాళ్లు క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ఆడారని, ఈ విజయ ప్రయాణంలో భాగం కావడం తన అదృష్టమని అన్నారు. ఇన్నేళ్లుగా అత్యున్నత స్థాయిలో ఆడుతున్నప్పటికీ ఇంకా తనకు ప్రేరణ ఏమిటనే ప్రశ్నకు స్పందిస్తూ.. జట్టులో ప్రతి ఒక్కరూ మరింత మెరుగుపడాలనే తపనతో ఉంటారని చెప్పారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ తమ ఆటను మరో స్థాయికి తీసుకెళ్లామని, అభిమానులు తమ ఆటను ఆస్వాదించడం కంటే పెద్ద సంతోషం మరొకటి లేదన్నారు. మహిళల క్రికెట్ అభివృద్ధిపై కూడా పెర్రీ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పుడు అమ్మాయిలతో పాటు అబ్బాయిలు కూడా మహిళల క్రికెట్‌ను ఆస్వాదిస్తూ స్టేడియాలకు రావడం సంతోషకర పరిణామమన్నారు. భవిష్యత్తులో మహిళల క్రికెట్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందనే నమ్మకం వ్యక్తం చేశారు. అభిమానులకు, చిన్నారులను స్టేడియాలకు తీసుకొస్తున్న తల్లిదండ్రులకు పెర్రీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మహిళల క్రికెట్‌కు లభిస్తున్న ఆదరణే తమకు మరింత ప్రేరణనిస్తోందని, అభిమానుల ప్రేమ, మద్దతు వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని భావోద్వేగంగా పేర్కొన్నారు.

# 10న లెనిన్ విడుదల




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷-లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.



# నాగార్జున వందో సినిమాలో టబూ

నెగెటివ్ షేడ్‌లో ఉంటుంది అంటూ ప్రచారం


టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పారిపోదామనుకున్నా..

**కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు**

ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు. తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్



**ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# ఇరుముడితో బిజీ.. అయినా కొత్త సినిమాపై దృష్టి

**శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవతేజ యత్నం**




మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com